నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
బుధవారం | మార్చి 05, 2025 | www.navatelangana.com

సోలార్ పవర్ ప్లాంట్ కొరకు స్థల పరిశీలన

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని వెల్గనూర్ పంచాయతీ పరిధిలోని అందుగులపేటలో ఏర్పాటు చేయనున్న సోలార్ విద్యుత్ పవర్ ప్లాంట్ కొరకు రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం స్థల పరిశీలన చేశారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటు కొరకు అనుకూలమైన స్థలాన్ని ఎంపిక చేసేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు బృంద సభ్యులు తెలిపారు. ప్లాంటు ఏర్పాటు కొరకు అనుకూలమైన వాతావరణం, పరిస్థితుల అంచనా స్థితిగతులపై ఆరా తీసినట్లు వారు తెలిపారు. సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా చుట్టుపక్కల గ్రామాలకు విద్యుత్ సౌకర్యం పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బొద్దుల భూమన్న, విద్యుత్ శాఖ అధికారులు, రెడ్ కో సంస్థ ప్రతినిధులు, ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.



గోదావరిలో మునిగి వాచ్‌మెన్ మృతి

నవతెలంగాణ-లక్షెట్టిపేట

ముల్కల్లగూడెంకు చెందిన ముల్కల్ల సత్యనారాయణ(44) ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి మృతి చెందినట్లు ఎస్ఐ పి.సతీష్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..కాగజ్‌నగర్ ఎస్సీ వసతి గృహంలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న సత్యనారాయణ మంగళవారం ఉదయం గోదావరి నదికి స్నానం కోసం వెళ్లాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగి చనిపోయాడు. మృతుని భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.



శాంతిఖని విస్తరణపై భిన్నాభిప్రాయాలు

- పర్యావరణ పరిరక్షణపై ప్రభావిత గ్రామాల్లో ఆందోళన
- 6న అభిప్రాయ సేకరణ

బెల్లంపల్లిలో సింగరేణి సంస్థ నిర్వహిస్తున్న శాంతిఖని లాంగ్వాల్ ప్రాజెక్టు విస్తరణపై ప్రజల నుండి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శాంతిఖని ప్రభావిత ప్రాంతాల్లో సింగరేణి యాజమాన్యం పర్యావరణ పరిరక్షణ చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పరిసర ప్రాంత ప్రజలకు ఉద్యోగ, ఉపాధి మార్గాలు చూపించడంలో సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. శాంతిఖని లాంగ్వాల్ ప్రాజెక్ట్ అనుమతుల పునరుద్ధరణకు ప్రభావిత గ్రామాల ప్రజల అభిప్రాయ సేకరణకు మార్చి 6న కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పాత గని ప్రాంతంలో సమావేశం నిర్వహించనున్నారు. శాంతిఖని లాంగ్వాల్ ప్రాజెక్టు గని సామర్థ్యాన్ని 14.34 హెక్టార్లకు విస్తరించేందుకు సింగరేణి యాజమాన్యం కసరత్తు చేస్తోంది. దీని ద్వారా 9మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలను వెలికి తీసే అవకాశాలున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

నవతెలంగాణ-తాండూర్

శాంతిఖనిని మొదట్లో ఓపెన్‌కాస్ట్‌గా మారుస్తామన్న వార్తల నేపథ్యంలో ఈ ప్రాంత ప్రజల నుండి వ్యతిరేకత వచ్చింది. దీంతో సింగరేణి యాజమాన్యం అండర్ గ్రౌండ్ విధానంలోనే లాంగ్వేజ్ టెక్నాలజీ ఉపయోగించి శాంతిఖని గని జీవిత కాలాన్ని పెంచే ప్రయత్నాలు చేస్తోంది. శాంతిఖని లాంగ్ వాల్ ప్రాజెక్ట్ విస్తరణకు సమీప గ్రామాల ప్రగతికి అవరోధం కలగకుండా చర్యలు తీసుకుంటామని యాజమాన్యం చెబుతున్నప్పటికీ ఆచరించడం లేదని ప్రజా, కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. శాంతిగని విస్తరణలో బెల్లంపల్లి మండలంలోని ఆకెనపల్లి, లింగాపూర్, బట్వాన్‌పల్లి, పెర్కపల్లి, మన్నెగూడెం, దుబ్బపల్లి, పాత బెల్లంపల్లి గ్రామాలు ప్రభావితం అవుతున్నట్లు అధికారులు గుర్తించారు. గని విస్తరణ వల్ల జీవన విధానానికి ఎలాంటి అవరోధం ఎదురవుతుందోనని ప్రభావిత గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 2018లో శాంతిఖని లాంగ్వాల్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికులకు ఉపాధి కల్పిస్తామని చెప్పిన అధికారులు ఆ విషయాన్ని మరిచిపోయారని ప్రజలు ఆరోపిస్తున్నారు. భూగర్భ జలాల పునరుద్ధరణకు యాజమాన్యం చర్యలు తీసుకోవడం లేదని వారు ఆవేదన చెందుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటి బోరు బావుల్లో నీటిమట్టం తగ్గిందని ఆందోళన చెందుతున్నారు. లాంగ్ వాల్ ప్రాజెక్టు వల్ల పరిసర ప్రాంత వాతావరణ మార్పుల్లో వ్యత్యాసాలు ఏర్పడుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. మార్పుల కారణంగా పర్యావరణం, జీవావరణంలో వ్యత్యాసాలు ఏర్పడి మానవ జీవన విధానానికి అవాంతరాలు ఏర్పడుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శాంతిఖనిలో నీటిని తోడి పంపింగ్ ద్వారా చెరువులు నింపుతామన్న అధికారులు మర్చిపోయారని పేర్కొంటున్నారు. ముంపు గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ, ఉపాధి మార్గాలు చూపించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటున్నారు. గని నిర్వహణలో యాంత్రీకరణతో ఉపాధి మార్గాలు కూడా తక్కువయ్యాయని ప్రజలు పేర్కొంటున్నారు.



శాంతిఖని ముఖ ద్వారం

డీఎంఎఫ్టీ, సీఎస్ఆర్ నిధులు పక్కదారి

పకృతి సహజ వనరులను ఉపయోగించుకొని మైనింగ్ చేస్తున్న సింగరేణి సంస్థ ప్రభావిత పరిసర ప్రాంతాల అభివృద్ధికి డీఎంఎఫ్టీ, సీఎస్ఆర్ నిధులను ఖర్చు చేస్తోంది. నిధులను పరిసర ప్రాంతాల అభివృద్ధికి ఉపయోగించాల్సింది ఉండగా ఆయా నిధులు అందుకు విరుద్ధంగా వినియోగం కావడంతో ముంపు గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. సంబంధిత నిధులను స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ ప్రమేయంతో ఖర్చు చేస్తున్నప్పటికీ ప్రభావిత గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంలో సింగరేణి యాజమాన్యం పూర్తిగా విఫలమవుతోంది. సంబంధిత నిధుల వినియోగంలో యాజమాన్యం గ్రామపంచాయతీలో జమ చేసి తీర్మానాల మేరకు నిధులు ఖర్చు చేయాలని ప్రజలు కోరుతున్నారు. నిధుల వినియోగానికి సంబంధించి నియోజకవర్గ స్థాయిలో కార్మిక, మహిళా సంఘాలు స్థానిక సంస్థల ప్రతినిధులతో కమిటీని రూపొందించాలని కోరుతున్నారు. ప్రభావిత గ్రామాల్లో యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలంటున్నారు. మండలంలో నిర్మిస్తున్న సోలార్ పవర్‌ప్లాంట్ ప్రాజెక్టులో సమీప గ్రామాల యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరుతున్నారు.

ప్రభావిత గ్రామాల్లో సౌకర్యాలు కల్పిస్తున్నాం : ఖాదిర్, శాంతిఖని ఏజెంట్



ప్రభావిత గ్రామాల్లో సౌకర్యాలు కల్పిస్తున్నాం. పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఆకెనపల్లి నుండి మందమర్రి వరకు పది కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాం. బెల్లంపల్లి నుండి పెర్కపల్లి వరకు 8కిలో మీటర్ల బీటీ రోడ్డు వేశాం. శాంతిఖని సమీప గ్రామాల్లో 23 చేతి పంపులు వేశాం. వచ్చే అదనపు నీటిని సమీప గ్రామాల వ్యవసాయ అవసరాలకు వినియోగిస్తున్నాం. బెల్లంపల్లి పట్టణంలో సిసి రోడ్లు, సిసి డ్రైనేజీలు, హైమాస్ట్ వీధి దీపాలు, ఓపెన్ జిమ్, కమ్యూనిటీ టాయిలెట్లు, అంబేద్కర్ భవన నిర్మాణాన్ని చేపట్టాం. పర్యావరణ పరిరక్షణకు మందమర్రి ఏరియాలో 1198 హెక్టార్లలో 17.84 లక్షల మొక్కలు నాటాం. సమీప గ్రామ నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్యత శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు పొందేందుకు తోడ్పాటు అందిస్తున్నాం. వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందిస్తున్నాం. ఇప్పటి వరకు మందమర్రి ఏరియాలో 2080 మందికి స్వయం ఉపాధి మార్గాలను చూపాం. సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ డీఎంఎఫ్టీలో సింగరేణి యాజమాన్యం రూ.587.08 కోట్లు జమ చేసింది. ప్రాజెక్టు పరిధిలోని పరిసర ప్రాంతాల్లో వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు అంచనా వేసి పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా చర్యలు తీసుకుంటున్నాం. శాంతిఖని విస్తరణలో భూగర్భ గని కార్యకలాపాలకు అదనపు భూమి అవసరం లేదు. పారిశ్రామికరణవల్ల జాతికి జరిగే మేలును గ్రహించి ప్రజలు సహకరించాలి.

తీన్మార్ మల్లన్నపై సస్పెన్షన్ ఎత్తేయాలి

మంచిర్యాల: తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ నుండి సస్పెండ్ చేయడం తెలంగాణ యావత్ బీసీ సమాజాన్ని అవమాన పరచడమే అని జాతీయ బిసి హక్కుల పోరాట సమితి నాయకులు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ బీసీ కులగణనలో తప్పులు జరిగాయని చూపెట్టినందుకే కాంగ్రెస్ మల్లన్నను సస్పెండ్ చేశారన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లను ఎత్తివేసి బీసీలపై జరుగుతున్న అన్యాయాలపై పోరాటం చేసినందుకు సస్పెండ్ చేస్తారా అని ప్రశ్నించారు. మల్లన్నను పార్టీ నుండి సస్పెండ్ చేయడానికి గల కారణాలను కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ సమాజానికి చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర జనాభాలో 56శాతం బీసీ జనాభా ఉన్నప్పటికీ అసెంబ్లీ, పార్లమెంట్, నామినేటెడ్ పదవులలో బిసిలకు అవకాశాలు లేకపోవడం అనేది బీసీలపై చూపిస్తున్న వివక్ష అన్నారు. ఓ పక్క బిసి జనాభా ప్రాతిపదికన అవకాశాలు కల్పించాలని బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు నడుస్తున్న నేపథ్యంలో మల్లన్నను సస్పెండ్ చేయడం దుర్మార్గమని, బీసీల ఆగ్రహానికి గురవ్వకముందే మల్లన్న సస్పెండ్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, నాయకులు రాజన్న యాదవ్, సల్మాన్, ఎల్కంటి కిరణ్, జయశంకర్, యాకూబ్ పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



నిర్మల్‌టౌన్: గ్రామపంచాయతీ సిబ్బందికి ఎస్‌టిఓల్లో నిలిచిపోయిన వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. ఈ మేరకు గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సురేష్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగాల తరహాలో ప్రతినెల గ్రీన్ ఛానల్ ద్వారా 2025 జనవరి 1 నుంచి వేతనాలు చెల్లిస్తామని ప్రకటించిన విధంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎస్‌టిఓలో నిలిచిపోయిన బకాయి వేతనాలు విడుదల చేయాలని, పంచాయతీల బ్యాంక్ ఖాతాలపై ఫ్రీజింగ్ ఎత్తివేయాలని, ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో కార్మికుల భద్రతను దృష్టిలో పెట్టుకొని ఒక పూట పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు బి సతీష్, నాయకులు ప్రశాంత్, మహేందర్, ఆశన్న, సుమన్, ఆశన్న పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికి తీయడానికి సృజన టెక్ ఫెస్ట్



ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడానికి సృజన టెక్ ఫెస్ట్-2024-25ను నిర్వహిస్తున్నామని సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బండి రాంబాబు అన్నారు. మంగళవారం పాలిటెక్నిక్ కళాశాలలో సృజన టెక్ ఫెస్ట్ 2024-25లో భాగంగా విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను చూశారు. న్యాయ నిర్ణేతలుగా ట్రాన్స్‌కో ఏఈ రవి, అధ్యాపకురాలు భార్గవి వ్యవహరించి విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్స్‌ను పరిశీలించారు. వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. జిల్లా స్థాయి సృజన టెక్ ఫెస్ట్ 2024-25లో ఉమ్మడి జిల్లాలోని బెల్లంపల్లి, నిర్మల్, ఉట్నూర్, ఆదిలాబాద్ పాలిటెక్నిక్ కళాశాల ఎలక్ట్రిక్, కంప్యూటర్ విభాగం విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రదర్శనలను తిలకించి జిల్లా స్థాయిలో ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపిస్తామని పేర్కొన్నారు. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయిలో ఇక్కడ ఎంపికైన ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శిస్తారని తెలిపారు. విద్యార్థులు మరింత కష్టపడి మంచి ప్రదర్శనలు ఇవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కంప్యూటర్ విభాగం ఇన్‌చార్జి హెచ్‌డి సంగీత, ఎలక్ట్రిక్ విభాగం ఇన్‌చార్జి హెచ్‌డి క్రాంతికుమార్ ఉన్నారు.

విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలి



లక్షెట్టిపేట: పదో తరగతితో పాటు ఇంటర్ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ దిలీప్‌కుమార్ సూచించారు. హాస్టల్ నిద్రలో భాగంగా పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకులాన్ని ఆయన సోమవారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, మెనూ, ఆహార నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల హాజరు రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖాముఖిలో భాగంగా వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపల్ రోనాల్డ్ కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ద్వారా పథకాలు అందించాలి



ఆదిలాబాద్‌టౌన్: కార్మిక సంక్షేమ బోర్డును ప్రయివేట్ పరం చేయకుండా ప్రభుత్వం ద్వారా పథకాలను అందించాలని ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ నారాయణ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రభుత్వం తీరుకు నిరసనగా కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పలు సమస్యలతో కూడాన వినతిపత్రాన్ని లేబర్ ఆఫీసర్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో రోజురోజుకు కార్మిక వర్గం పెరుగుతోందన్నారు. అయినా వారికి భద్రత, చట్టబద్ధ హక్కులు అమలు చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కార్మిక సంక్షేమ బోర్డును ప్రయివేట్‌పరం చేసేలా ప్రభుత్వం యోచిస్తుందన్నారు. దీన్ని ఉపసంహరించుకోవాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు సుభాష్, తౌఫిక్, అజీం, రాకేష్, రాజ్, ఊశన్న, మారుతి, ఎం.గణేష్ పాల్గొన్నారు.

సాంకేతికత లక్ష్యంతోనే ల్యాప్‌టాప్‌లు

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సాంకేతికతను వినియోగించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ల్యాప్‌టాప్‌లు అందిస్తుందని డీఈఓ ప్రణీత అన్నారు. సమగ్ర శిక్షణ నుంచి వచ్చిన 19 ల్యాప్‌టాప్‌లు, 13 ట్యాబ్లను మంగళవారం డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు అందించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉందన్నారు. దాని కోసం ప్రధానోపాధ్యాయులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం లాప్‌టాప్‌లు, ట్యాబ్స్ పంపిణీ చేసిందన్నారు. తొలి విడుతలో 19 పాఠశాలలు, 13 స్కూళ్లకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అదే విధంగా అపార్‌లో విద్యార్థుల నమోదులో హెచ్‌ఎంలు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు. అలా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రొగ్రాం కోఆర్డినేటర్ సుజాత్, సెక్టోరియల్ అధికారి నారాయణ, జిల్లా సైన్స్ అధికారి రఘురమణ, అసిస్టెంట్ సైన్స్ అధికారి భాస్కర్ పాల్గొన్నారు.

బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా కొనసాగించాలి

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-నిర్మల్

బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బాలశక్తి కార్యక్రమం నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్య, ఆర్థిక, సామాజిక సామర్థ్యాలు, నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రత్యేకంగా అమలుపరుస్తున్న బాలశక్తి కార్యక్రమాన్ని మెరుగ్గా అమలుపరచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ వైద్య పరీక్షల నిర్వహణ కార్యక్రమం నిరంతరం కొనసాగించాలని వైద్యాశాఖ అధికారులను ఆదేశించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన విద్యార్థులందరికీ హెల్త్ కార్డులను అందించాలని, అనారోగ్య సమస్యలను గుర్తించినట్లయితే వారికి ప్రత్యేక పోషక ఆహారం, మందులను అందించాలని తెలిపారు. ఇప్పటికే పలువురు విద్యార్థుల్లో అనారోగ్య సమస్యలను గుర్తించి సమస్యలను అధిగమించడానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. పరీక్షల పట్ల భయాన్ని తొలగించేలా, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేలా మానసిక వైద్య నిపుణులతో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆర్థిక అక్షరాస్యత పెంపొందించేలా క్షేత్రస్థాయిలో బ్యాంకులకు తీసుకెళ్లి బ్యాంకు లావాదేవీలు, వివిధ రకాల రుణాలు, బ్యాంకింగ్ ఫారాలు, సైబర్ అక్షరాస్యత పెంపొందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే పలు పాఠశాలల విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటనలు పూర్తయ్యాయని తెలిపారు. అన్ని పాఠశాలల్లో నమూనా పార్లమెంట్ నిర్వహించి విద్యార్థులకు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఏప్రిల్ నెలలో విద్యార్థులందరికీ వివిధ అంశాలపై పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నీటి కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పాఠశాలలో ఫిర్యాదులు, సూచనల పెట్టెలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిఈఓ పి. రామారావు, డిఎంహెచ్ఓ రాజేందర్, గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కాంపౌండ్ వాల్ నిర్మించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.కిరణ్



ఉట్నూర్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కాంపౌండ్ వాల్ నిర్మించాలని ఎస్ఎఫ్ఐ(భారత విద్యార్థి ఫెడరేషన్) రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.కిరణ్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్ మాట్లాడారు. ఐటీడీఏ కేంద్రంగా ఉన్న సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. డిగ్రీ కళాశాల, వసతిగృహానికి కాంపౌండ్ వాల్ లేక అనేక విష పురుగులు విద్యార్థులపై దాడి చేస్తున్నాయని పేర్కొన్నారు. అనేక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న పరిస్థితి ఉందన్నారు. అదేవిధంగా విద్యార్థులు నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డిగ్రీ కళాశాలకు సరిపోయే క్లాస్ రూమ్స్ లేక 2100 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సెమినార్ హాల్ లేదని, లైబ్రరీ ఉన్నా పుస్తకాలు లేవని తెలిపారు. విద్యార్థులు అరకొర సౌకర్యాలతో ఇరుకు గదుల్లో విద్యాభ్యాసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీ కళాశాల హాస్టల్‌లో ఎండలు మండుతుంటే ఒక చల్లటి చలివేంద్రం కూడా ఏర్పాటు చేయలేదని, ఇది అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని తెలిపారు. వెంటనే ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్పందించి పైసమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సక్కు, సాయి, సీతారాం, పవన్, బలరాం పాల్గొన్నారు.

ఘనంగా సింగరేణి పాఠశాల వార్షికోత్సవ వేడుకలు



నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి పాఠశాల 50వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సింగరేణి ఉన్నత పాఠశాల 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షికోత్సవ వేడుకలను ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ జి.దేవేందర్, సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణిలో విధులు నిర్వర్తిస్తూ సేవలందిస్తున్న ఉద్యోగులు, కార్మికులు, పరిసర ప్రాంతాల ప్రజల పిల్లల ఉజ్వల భవిష్యత్తు విద్యతోనే సఫలం అవుతుందని భావించి సింగరేణి ఆధ్వర్యంలో విద్యాలయాలు, ఆసుపత్రులు నిర్మించారని తెలిపారు. మందమర్రిలో సింగరేణి ఉన్నత పాఠశాల వేల మందికి విద్యా బోధన అందించి దేశ, విదేశాలలో ఉన్నత స్థాయి ఉద్యోగులుగా, వ్యాపారవేత్తలుగా ఎదిగి సింగరేణి కీర్తిని ఖండాంతరాలు దాటించారని కొనియాడారు. ప్రముఖ రాజకీయ శాస్త్రవేత్త, విశ్లేషకుడు, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రాజకీయ శాస్త్రం ప్రొఫెసర్ నాగేశ్వర్ విద్యాభ్యాసం సింగరేణి పాఠశాలలో మొదలైందని గుర్తు చేశారు. పది ఎకరాల విశాల స్థలంలో, క్రీడా మైదానంతో ఆహ్లాదకరమైన విద్యాలయంలో ఉచిత యూనిఫాం, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని తెలిపారు. కార్పొరేట్ స్థాయి విద్యతో సమానంగా సైన్స్ ల్యాబ్, డిజిటల్ ల్యాబ్, గ్రంథాలయం, ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ సౌకర్యాలు కలిగి ఉన్న ఏకైక విద్యాలయమని తెలిపారు. 35 మంది నిష్ణాతులైన బోధన, బోధనేతర సిబ్బందితో విద్యను అందిస్తూ 2023-24 సంవత్సరానికి 96 శాతం ఉత్తీర్ణత సాధించిందన్నారు. 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలను సింగరేణి ఆధ్వర్యంలో జూన్ మాసంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఏరియా సేవా అధ్యక్షురాలు సరూపరాణి, ఎస్ఓటు జిఎం విజయప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మహిళా దినోత్సవ పోస్టర్లు ఆవిష్కరణ



నిర్మల్: తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల పోస్టర్లను మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మహిళా దినోత్సవ వేడుకలకు జిల్లా నుంచి మహిళా అధికారులు, ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. టీజీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పిజి రెడ్డి మాట్లాడుతూ టీజీవో కేంద్ర సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 6 నుండి 8వ వరకు హైదరాబాద్‌లోని ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయ కళాశాల, దోమలగూడలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు రాష్ట్ర మహిళా మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. జిల్లా నుండి అధిక సంఖ్యలో మహిళా ఉద్యోగులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా కార్యదర్శి ధాత్రిక రమేష్, అసోసియేట్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌కుమార్, జిల్లా మహిళా విభాగ బాధ్యులు గోదావరి, డాక్టర్ రాణి, కరుణశ్రీ, దేవోల్ల లత, ఉపాధ్యక్షులు శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవి కుమార్, పబ్లిసిటీ సెక్రటరీ విష్ణువర్ధన్, ఆఫీస్ సెక్రెటరీ క్రాంతికుమార్, కార్యవర్గ సభ్యులు, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | మార్చి 05, 2025 | www.navatelangana.com

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పరిశీలన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మావల మండలంలోని వాఘాపూర్‌లో మంగళవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను కాంగ్రెస్ ఆదిలాబాద్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి హేమలత గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



రోగుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలి


నవతెలంగాణ-ఉట్నూర్

ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల వైద్యసిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏజెన్సీ డిప్యూటీ డీఎంహెచ్ఓ కుడ్మెత మనోహర్ అన్నారు. మంగళవారం మండలంలోని శ్యామ్‌పూర్ ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. డాక్టర్, నర్సుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, ఆస్పత్రికి వచ్చే గర్భిణీలను డెలివరీకి ఉట్నూర్ ఆస్పత్రికి తరలించాలని సూచించారు. కార్యక్రమంలో శిశు సంక్షేమ శాఖ ప్రోగ్రాం అధికారి సాధన, డాక్టర్ రాథోడ్ సందీప్ కుమార్, సూపర్‌వైజర్ కృప, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



పదిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- విద్యార్థులకు అల్పాహారం అందజేత



పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-కుభీర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. గత సంవత్సరం ఫలితాల కంటే ఈ సంవత్సరం మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో విద్యాశాఖ కృషి చేస్తోంది. అందులో భాగంగానే ప్రధానోపాధ్యాయులు, భాషా పండితులు కృషి చేస్తున్నారు. కుభీర్ మండలంలోని కుభీర్, పల్సి, పార్డి(బి), నిగ్వ, మలేగాం, డోడర్నా ఆశ్రమ పాఠశాలతో పాటు కస్తూరిబా గాంధీ బాలికల ఉన్నాత పాఠశాలలో సుమారు 235 మంది విద్యార్థినీ, విద్యార్థులు విద్యానభ్యసిస్తున్నారు. ప్రతి రోజు పాఠశాల సమయం అయినా తర్వాత సాయంత్రం ఐదు గంటల నుంచి గంట పాటు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్య బోధన చేపడుతున్నారు. ఈ ఏడాదిలో వందకు వంద శాతం ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సైతం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా రాష్ట్రంలోనే నిర్మల్ జిల్లాకు మొదటి స్థానం రావాలని దీని కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని కలెక్టర్, విద్యాశాఖ అధికారులకు సమీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎంఈఓ విజయ్ కుమార్ ప్రతి రోజు పదో తరగతులను పర్యవేక్షిస్తూ, విద్యార్థులతో మాట్లాడుతున్నారు. స్వయంగా వారికి ప్రశ్నలు వేసి జవాబులు రాబడుతున్నారు. అదే విధంగా ప్రత్యేక తరగతులలో పాల్గొంటున్నా విద్యార్థిని, విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేక నిధులని సైతం కేటాయించి, ఒకొక్క విద్యార్థికి అల్పాహారనికి రూ.15 ఖర్చు చేస్తుంది. విద్యార్థుకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కానీ కొన్ని పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం తక్కువ ఉండటంతో ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారింది. విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి పాఠశాలకు పంపాలని చెబుతున్నారు. మరి కొద్ది రోజుల్లో వేసవి కాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు ఇప్పటి నుండే విద్యార్థులకు ప్రత్యేక తరగతులపై దృష్టి సారించారు.

అల్పాహారం అందిస్తున్నారు



పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. అదనంగా ఇంకో గంట పాఠశాలలో ఉంటున్నందుకు ఆకలి కాకుండా విద్యార్థులకు ప్రభుత్వం అల్పాహారం అందిస్తోంది. దీంతో చదువుపై ఆసక్తి చూపిస్తున్నాం.

ధావుల శ్వేత,
విద్యార్థిని, పార్డి(బి) ప్రభుత్వ ఉన్నత పాఠశాల

అర్థమయ్యే విధంగా పాఠాలు బోధిస్తున్నారు



విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు పాఠాలు భోదిస్తున్నారు. ఉదయం సాయంత్రం క్రమం తప్పకుండా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూన్నారు. దీంతో విద్యార్థుల పఠనా సామర్థ్యాలు పెంపొందుతున్నాయి.

కన్నల గంగాధర్
పదో తరగతి విద్యార్థి, పార్డి(బి) ఉన్నత పాఠశాల

వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తాం



మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకునే పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నాం. ప్రతి రోజు వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. వందశాతం ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

ఎంఈఓ విజయ్ కుమార్

పది పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఉండదు



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

పదో తరగతి వార్షిక పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఉండదని డీఈఓ రామారావు అన్నారు. మంగళవారం మండలంలోని కడ్తాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో డీఈఓ మాట్లాడారు. తరగతి గదిలో నిర్వహించిన గ్రాండ్ టెస్ట్‌లో మార్కుల ఆధారంగా విద్యార్థులను పిలిచి, అన్ని విషయాల్లో వారి పురోగతిని విద్యార్థుల వారీగా పరిశీలించారు. గణితం, ఆంగ్లం, రెండు విషయాల్లో చాలా కష్టపడాలని, చక్కని మార్కులు పొందాలని, అలాగే మిగతా విషయాలు కూడా కష్టపడి చదవాలన్నారు. విద్యార్థులందరూ పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరుకావాలని, గైర్హాజరులో ఉండకూడదని సూచించారు. గైర్హాజరైన ఇద్దరు విద్యార్థుల కారణాలను వారి మిత్రుల ద్వారా తెలుసుకున్నారు. ఎవరు కూడా గైర్హాజరు కాకుండా వారి మిత్రులందరూ చూసుకోవాలని తెలిపారు. ఈ సారి పదోతరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్ ఉండదని, పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తామని అన్నారు. విద్యార్థులు అన్ని విషయాలను చక్కగా కష్టపడి చదవాలని, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని అన్నారు. డీఈఓ వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్, జిల్లా ఉమ్మడి పరీక్షల సహాయ కార్యదర్శి భానుమూర్తి, ఆంగ్ల ఉపాధ్యాయురాలు శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ పోస్టర్లు ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా తెలంగాణ గజిటెడ్ అధికారుల మహిళ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని సహకారశాఖ కార్యాలయంలో పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పి.అరుణ మాట్లాడుతూ ఈనెల 6, 7 తేదీలలో మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా గజిటెడ్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు శారద, నవీన కళ, ఆరతి, సునీత, ఆశాజ్యోతి, దేవుబాయి, శశికళ, రజిత, కృష్ణవేణి పాల్గొన్నారు.

చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి



నవతెలంగాణ-ఖానాపూర్

విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఏసీఈ హై స్కూల్ కరస్పాండెంట్ కుత్బుద్దీన్, ప్రిన్సిపాల్ శ్రీకాంత్ కిషోర్ అన్నారు. ఖానాపూర్ పట్టణంలోని అంగడిబజార్‌లో ఏసీఈ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో మంగళవారం సైన్స్ ఫెయిర్‌ను ఘనంగా నిర్వహించారు. సీవీ రామన్ ఎఫెక్ట్ పురస్కరించుకొని విద్యార్థుల తల్లిదండ్రులు, సైన్స్ ఫెయిర్‌ను తిలకించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు పరిశోధనాత్మక ప్రయోగాలు అందరిని ఆకట్టుకున్నాయి. వాటర్ సైకిల్, ఎలక్ట్రిసిటీ సర్క్యులేషన్, అగ్రికల్చర్ ఓల్డ్ ఫార్మేషన్, న్యూ ఫార్మేషన్, డే అండ్ నైట్ సోలార్ సిస్టం వంటి 35 రకాల ప్రదర్శనలను ఈ సందర్భంగా అద్భుతంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇటువంటి కార్యక్రమాలను చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అధిక యూరియా వాడకంతో అనర్థాలు



నవతెలంగాణ-పెంబి

వ్యవసాయ పంట క్షేత్రాల్లో అధిక యూరియాను వాడటం అనర్థాలు ఏర్పాడుతాయని ఏఈఓ నవీన్ అన్నారు. మంగళవారం ఏఈఓ రాజ్ కుమార్, నాగమణిలతో కలిసి మండలంలోని నాగపూర్‌లో రైతులకు అధిక యూరియా వాడకం వల్ల పంటలలో జరిగే అనర్థాలపై సంపూర్ణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సరైన విత్తనాన్ని సరైన సమయంలో సముచిత స్థాయిలో పోషకాలు కలిగిన సరియైన భూమిలో నాటినప్పుడే మంచి పంట దిగుబడులు సాధ్యమవుతాయన్నారు. విచక్షణా రహితంగా వాడే యూరియా కారణంగా పంటలలో చీడ పీడలు ప్రబలే అవకాశాన్ని రైతులే కృత్రిమంగా సృష్టిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం నాగపూర్‌లో వరిలో అగ్గి తెగులు ఉధృతి పెరగడానికి అధిక యూరియా వినియోగం కూడా ఒక కారణమని రైతులకు వివరించారు. అధిక యూరియా వాడటం వల్ల పంటలు ఉండాల్సిన దానికన్నా ఎక్కువ పచ్చగా మారి చీడపీడలను ఎక్కువగా ఆకర్షించడంతో పాటుగా నేల, నీటి, కాలుష్యానికి కారణమవుతుందని తెలిపారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి, జీవ ఎరువుల వినియోగం పెంపొందించడం వల్ల నేల ఆరోగ్యంతో పాటుగా పర్యావరణ హితంగా ఉంటుందని రైతులకు సూచించారు. అగ్గి తెగులు వ్యాప్తిని గమనించిన రైతులు వెంటనే ట్రై సైక్లాజోల్ 0.6 గ్రాములు, లేదా ఐసోప్రోతయోలిన్ 1.5 మిల్లీలీటర్, లేదా కాసుగా మైసిన్ 2.5 మీల్లీలీటర్ మందులలో ఏదో ఒక దానిని లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయడం వల్ల వ్యాధి ఉధృతిని నియంత్రించొచ్చునని సూచించారు.

అత్యాచారాల నియంత్రణకు కఠిన చట్టాలు తేవాలి

- ఎన్పీఆర్డీ ఆధ్వర్యంలో మహిళ దినోత్సవం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాల నియంత్రణకు ప్రభుత్వాలు కఠిన చట్టాలను తీసుకురావాలని ఎన్పీఆర్డీ జిల్లా అధ్యక్షుడు నగేష్ డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య భవనంలో ఎన్పీఆర్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మహిళాలపై జరుగుతున్న దాడుల నివారణకు చట్టాలు ప్రభుత్వాలు చేయాల్సిన పనులను తెలియజేశారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ రోజురోజుకు దేశంలో మహిళాలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. మహిళల అభ్యున్నతికి సావిత్రిబాయి పూలే చేసిన ఉద్యమాలు, కర్తవ్యలను కూడా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఆడ పిల్లలను బయటకు పంపాలంటే భయపడే కాలంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బేటి బచావో-బేటి పడావో ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. అందుకే ప్రభుత్వం ప్రత్యేకంగా మహిళ రక్షణ కోసం కఠిన చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు.

వికలాంగులను నామినేట్ చేయాలని సంతకాల సేకరణ...

గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లో వికలాంగులను నామినేట్ చేయాలని ఎన్పీఆర్డీ జిల్లా అధ్యక్షులు మేస్రం నగేష్, ఉపాధ్యక్షులు కె.ఆశన్న అన్నారు. మంగళవారం ఎన్‌పీఆర్డీ ఆధ్వర్యంలో పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌లో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లో ఇద్దరు వికలాంగులను నామినేట్ చేయడానికి వీలుగా ప్రత్యేక చట్టం చేయాలని, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ విజ్ఞప్తి చేస్తుందన్నారు. ఇప్పటికే రాజస్థాన్, చత్తీస్‌ఘడ్ రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థల్లో ఇద్దరు వికలాంగులను నామినేట్ చేయడానికి ప్రత్యేక చట్టాలు చేసి అమలు చేస్తున్నారన్నారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ హామీ ఇచ్చిన ప్రకారం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున పంచాయతీ రాజ్ చట్టానికి మున్సిపల్ చట్టానికి సవరణలు చేసి, ఇద్దరు వికలాంగులను నామినేట్ చేసేందుకు వీలుగా తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018, తెలంగాణ మున్సిపాలిటీ చట్టం 2019లలో సవరణలు చేసి, ప్రత్యేక చట్టం చేసి వికలాంగులకు అవకాశాలు కల్పించాలని కోరారు. స్థానిక సంస్థల్లో ఇద్దరు వికలాంగులను నామినేట్ చేస్తే గ్రామ పంచాయతీలలో 25,538 మందికి, మున్సిపాలిటీలలో 260 మందికి, మున్సిపల్ కార్పొరేషన్లలో 26 మందికి, మండల ప్రజా పరిషత్‌లలో 1080మందికి, జిల్లా పరిషత్‌లో 64 మందికి రాజకీయ అవకాశాలు వస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 26,968 మందిని నామినేటెడ్ చేయడానికి అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్థానిక సంస్థల్లో వికలాంగులకు ప్రతినిత్యం కల్పిస్తూ అసెంబ్లీలో ప్రత్యేక చట్టం చేసి అమలు చేయాలని కోరారు. కార్యక్రమం సంఘం జిల్లా కార్యదర్శి ఆరిఫా, ఉపాధ్యక్షులు కె.ఆశన్న, నాయకులు పొచ్చన్న, రేణుక పాల్గొన్నారు.


సంతకాల సేకరణ చేపడుతున్న ఎన్పీఆర్డీ నాయకులు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గెలుపుపై బీజేపీ నాయకుల సంబరాలు

నవతెలంగాణ-ఉట్నూర్

పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద మంగళవారం బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బీజేపీ బలపర్చిన కొమురయ్య గెలుపొందడంతో బీజేపీ నాయకులు స్వీట్లు పంచి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రితేష్ రాథోడ్, జగన్ నాయక్‌లు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ గెలుపొందడంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందు వచ్చే స్థానిక ఎన్నికలపై నమ్మకం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎం చేసిందన్నారు. ఈ విజయానికి సహకరించిన ఉపాధ్యాయలకు, ఉపాధ్యాయ సంఘాలకు, తెలంగాణ ప్రజలకు బీజేపీ విజయానికి కృషి చేసిన కార్యకర్తలకు ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండరి రమేష్, సుమన్‌బాయి, రాజశేఖర్, సతీష్, ఆశన్న, శ్రీకాంత్, శేషరావు, విఠల్ పాల్గొన్నారు.

ముధోల్ : ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య గెలుపొందడంతో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సంబరాలు జరుపుకున్నారు. భారీ మెజార్టీతో ఉపాధ్యాయులు మల్క కొమరయ్యను గెలిపించడంతో ఉపాధ్యాయులకు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షులు కోరి పోతన్న, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఇన్‌చార్జిలు ధర్మపురి సుదర్శన్, తాటివార్ రమేష్, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ సాయిరాం, మాజీ ఎంపీటీసీ దేవోజీ భూమేష్, మాజీ ఉపసర్పంచ్ మోహన్ యాదవ్, సోషల్ మీడియా ఇన్‌చార్జి దర్శారం నరేష్ గుప్తా, కార్యకర్తలు పాల్గొన్నారు.

కడెం : టీచర్ ఎమ్మెల్సీగా కొమురయ్య గెలుపొందిన సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షులు కాశవేణి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా గెలుపు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షులు మాట్లాడారు. కొమురయ్య గెలుపుకు సహకరించిన ఉపాధ్యాయులందరికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండలాధ్యక్షులు ముక్కెర గంగాధర్, బీజేపీ నాయకులు మోహన్ నాయక్, జక్కుల సత్తన్న యాదవ్, తిరుమలయ్య, ములికి కృష్ణ, భూమన్న, నల్లగొండ, శ్రీరామ్, బుర్రసాయి, ప్రసాద్, శ్రావణ్, రాజన్న పాల్గొన్నారు.

సారంగాపూర్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి కొమురయ్య గెలుపొందడంతో మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ టపాకాయలు పేల్చి, మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షులు కాల్వ నరేష్, సీనియర్ నాయకులు చంద్ర ప్రకాష్‌గౌడ్, ఇప్ప భూమారెడ్డి, పోతన్న, పతాని నర్సయ్య, నారాయణ, తిరుమలచారి, ఆడెపు మహేందర్, మైస శేఖర్ గంగాధర్, భీమలింగం, రంజిత్, దయాకర్‌రెడ్డి, లింగాగౌడ్, సాయెందర్, తోట మల్లేష్, ప్రమోద్, డా.శివరాం బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య అత్యధిక మెజారిటీతో గెలిచిన సందర్భంగా నర్సాపూర్(జి) మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు బర్కుంట నరేందర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నరేందర్, శ్రీనివాస్, రవీంధర్, నరేష్ పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్ : టీచర్స్ ఎమ్మెల్సీగా మల్క కొమురయ్య గెలుపొందడంతో నిర్మల్ జిల్లా కేంద్రంలో బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి ఓటర్లకు పాదాభివందనాలు తెలిపారు. ఈ సందర్భంగా టపాసులు పేల్చి నినాదాలు చేశారు.

ఈ కార్యక్రమంలో నాయకులు అయ్యన్నగారి భూమయ్య, అంజు కుమార్‌రెడ్డి, మెడిసెమ్మ రాజు, పట్టణాధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, ఒడిసెల అర్జున్ ఉన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మల్క కొమురయ్య గెలుపొందటంతో బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. మంగళవారం వినాయక్‌చౌక్‌లో టపాసులు పేల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు వేదవ్యాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థిని ఉపాధ్యాయులు ఆశీర్వదించి గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జ్యోతిరెడ్డి, దయాకర్, దినేష్ మటోలియా, భీంసేన్‌రెడ్డి ఉన్నారు.


నిర్మల్‌టౌన్ : సంబరాలు చేసుకుంటున్న నాయకులు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
బుధవారం | మార్చి 05, 2025 | www.navatelangana.com

కూలీలకు గిట్టుబాటయ్యేలా పనులు సాగాలి

నవతెలంగాణ-జైనూర్



కూలీలకు గిట్టుబాటయ్యేలా పనులు సాగేలా కృషి చేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బానోద్ దత్తారం అన్నారు. మంగళవారం మండలంలోని జామ్ని గ్రామ పరిధిలో ఉన్న పలు తోటకు, ఆర్టికల్చర్, పశువుల పెంపకం షెడ్ల, మదర్ పౌల్ట్రీ షెడ్లను ఈజీఎస్ ఏపీఎం నరేష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీ గిట్టుబాటయ్యే విధంగా చూడాలని తెలిపారు. కూలీలకు సరైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పనులను పరిశీలించారు. పశువుల కోసం నిర్మిస్తున్న షెడ్‌ను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఈజీఎస్ టీఏ కేంద్ర బాబు ఉన్నారు.

గిరిజన క్రీడా పాఠశాలల ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉమ్మడి జిల్లాలోని మూడు పాఠశాలలతో పాటు హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లిలో గల క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఈనెల 6న జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడ ఆదర్శ పాఠశాలలో ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్రీడ పాఠశాలల ఎంపికకు వచ్చేవారు నాలుగో తరగతి చదువుతున్న బోనఫైడ్‌తో పాటు జనన ధ్రువీకరణ పత్రాలు, గిరిజన కుల సర్టిఫికెట్ తీసుకురావాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని రమాదేవి తెలిపారు. అలాగే ఆసిఫాబాద్ పట్టణంలో గల గిరిజన ఆదర్శ బాలికల క్రీడ పాఠశాలలో 5, 6, 7, 8, 9వ తరగతుల్లో మిగిలిపోయిన ఖాళీలను కూడా భర్తీ చేయనున్నట్లు, ఇతర వివరాలకు జిల్లా గిరిజన క్రీడల అధికారి బండ మీనరెడ్డి 9440010453, 8008090626 నెంబర్లని సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటు చదువుతో పాటు క్రీడాల్లో రాణించాలని ఆకాంక్షించారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- జిల్లా వ్యాప్తంగా 19 పరీక్ష కేంద్రాలు
- 5 నిమిషాలు ఆలస్యమైనా అనుమతి
- సీసీ కెమెరాలు ఏర్పాటు
- సంక్షిప్త సందేశాలతో బీఐఈ శుభాకాంక్షలు
- హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్



కెరమెరి : నంబర్లు వేస్తున్న అధికారులు

నవతెలంగాణ-కెరమెరి


విద్యార్థి జీవితంలో ఎంతో కీలకమైన ఇంటర్మీడియట్ పరీక్షలు సీసీ కెమెరాల నడుమ నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ ఏడాది పరీక్షలు జరిగే అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయితే బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య విద్యార్థులకు ఊరడం ఇచ్చే కీలకమైన ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాదిలా కాకుండా ఈ ఏడాది పరీక్షలకు ఐదు నిమిషాల ఆలస్యమైన పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను అనుమతించాలని ఆదేశాలు జారీ చేశారు. మాస్ ప్రాక్టీస్, చూచిరాతలు, ఒకరికి మరొకరు పరీక్ష రాయడం, ఇన్విజిలేటర్ల విధుల దుర్వినియోగం తదితర వాటికి తావులేకుండా పారదర్శకంగా పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ప్రయోగ పరీక్షల్లో ఈ విధానాన్ని అమలు చేయగా వార్షిక పరీక్షల్లోనూ ఇందుకు అనుగుణంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

ప్రత్యేక బృందాల ఏర్పాటు

పరీక్షల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా హైపవర్, డీఈసీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. హైపవర్ కమిటీకి అధ్యక్షుడిగా కలెక్టర్, కన్వీనర్‌గా జిల్లా ఇంటర్ నోడల్ అధికారి, డీఈసీ కమిటీ సభ్యులుగా సీనియర్ ప్రిన్సిపాల్, సీనియర్ అధ్యాపకుడు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంలో ఆయా కళాశాలలకు చెందిన అధ్యాపకులు సభ్యులుగా ఉంటారు. ముగ్గురు సభ్యులతో కూడిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంతో పాటు ఇద్దరు సభ్యులతో ఒక్కో బృందం చొప్పున రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా..

జిల్లాలోని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలనూ ఏర్పాటు చేయగా ప్రతీ కేంద్రంలో ప్రశ్నపత్రాలు తీసే ప్రాంతం, ప్రవేశ ద్వారం వద్ద, తరగతి గది, తదితర ప్రాంతాల్లో మొత్తం ఐదు సీసీ కెమెరాలు బిగించారు. ఇంటర్ బోర్డు అధికారుల ఆదేశాల ప్రకారం పరీక్ష జరిగే తీరు మొత్తం రికార్డు చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. ఇతరులెవరూ రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు.



బీఐఈ సందేశం

ఇన్విజిలేటర్లను ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ కళాశాలల్లో పనిచేసే అధ్యాపకులతో పాటు అవసరమున్న కేంద్రాల్లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను నియమించే ప్రక్రియ పూర్తి చేశారు.

అన్ని పరీక్ష కేంద్రాల్లో నేటి నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.



కెరమెరి : కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

జిల్లాలో 19 పరీక్ష కేంద్రాలు..

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మొత్తం 48 జూనియర్ కళాశాలలు ఉండగా వీరి కోసం 19 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 11 ప్రభుత్వ, రెండు ప్రయివేటు, రెండు ఆదర్శ పాఠశాలలు, రెండు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 19 పరీక్షా కేంద్రాల్లో 10,043 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో 4,756 మంది విద్యార్థులు మొదటి సంవత్సరం, 5,287 మంది ద్వితీయ సంవత్సరంలో విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

ఆసిఫాబాద్ : జిల్లాలో నేటి నుండి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఈనెల 20 వరకు జనరల్ విద్యార్థులకు పరీక్షలు జరగనుండగా 25 వరకు ఒకేషనల్ విద్యార్థులకు పరీక్షలు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 10043 మంది విద్యార్థులు హాజరుకానుండగా ఇప్పటికే అధికారులు ఏర్పాటు చేశారు. అయితే ఇంటర్మీడియట్ బోర్డు ఈసారి ప్రత్యేకంగా హాల్ టికెట్లను కాలేజీలో నుండి కాకుండా నేరుగా రిజిస్ట్రేషన్ మొబైల్ నెంబర్‌కు లింక్ పంపించి డౌన్‌లోడ్ చేసుకునే విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. ఇదే సందర్భంలో విద్యార్థుల్లో ఉన్న ఒత్తిడి తగ్గించడంతో పటు వారు పరీక్షకు పూర్తిస్థాయిలో సన్నద్ధం అయ్యేవిధంగా మొబైల్ ఫోన్లకు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో సంక్షిప్త సందేశాలను పంపించి శుభాకాంక్షలు తెలపడంతో పాటు బాగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలంటూ సందేశాలు పంపించారు. దీనితో కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకురావడంతో పాటు విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని నింపే ప్రయత్నం చేశారు. హాల్ టికెట్లపై కూడా నూతనంగా క్యూఆర్ కోడ్ ఇచ్చిన అధికారులు దానితో సెంటర్ తెలుసుకోవడంతో పాటు ఎటువంటి వస్తువులు సెంటర్‌కు తీసుకువెళ్లాలనే విషయం కూడా తెలియనుంది. జిల్లా కేంద్రంలోని ఐదు సెంటర్లలో అధికారులు మంగళవారం ఏర్పాట్లు పూర్తి చేశారు.

వాంకిడి : నేటి నుండి నిర్వహించే ఇంటర్ మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు చీఫ్ సూపరింటెండెంట్ చంద్రయ్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కలిపి మొత్తం 400 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు. ఈ పరీక్షలకు డిపార్ట్‌మెంటల్ అధికారిగా ఆత్మారాం నియమితులయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.



ఆసిఫాబాద్ : నంబర్లు వేస్తున్న అధికారులు


ఉపాధి కూలీలకు కనీస వేతనం చెల్లించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఉపాధి కూలీలకు కనీస వేతనంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ అన్నారు. మంగళవారం కాగజ్‌నగర్ మండలంలోని దరిగం ఫారెస్ట్‌లో ఎన్జీవోస్ కాలనీ, భట్టుపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ కార్మికులు ఫారెస్ట్‌లో గుంతలు తవ్వుతున్నారు. వీరితో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకున్నారు. ఉపాధి కూలీలు వారికి కనీసం రూ.200 కూడా రోజుకు పడడం లేదని అదే విధంగా గడ్డపారాలు, గంపలు, పారా ఇవ్వడం లేదని, మంచినీటి సదుపాయం కల్పించడం లేదని, మెడికల్ కిట్లు ఇప్పటికి ఇవ్వలేదని, పని స్థలంలో టెంట్లు వేయడం లేదని ఆయనతో చెప్పారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ఎండలో పనులు చేస్తున్న గిట్టుబాటు కూలీ ఇవ్వడం లేదన్నారు. ఉపాధి పనిముట్లు ప్రభుత్వమే ఇవ్వాలని, కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు.

బెలూన్ థియేటర్‌లో క్రికెట్ లైవ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఐసీసీ చాంపియన్ ట్రోఫీలో భాగంగా మంగళవారం జరిగిన ఇండియా ఆస్ట్రేలియా సెమీఫైనల్ మ్యాచ్‌ను జిల్లా కేంద్రంలోని బెలూన్ థియేటర్‌లో నిర్వాహకులు లైవ్ స్ట్రీమింగ్ చేశారు. టికెట్ ధర రూ.150 నిర్వాహకులు నిర్ణయించగా పట్టణంలోని ప్రజలు దీనిపై ఆసక్తి చూపారు. థియేటర్‌లో క్రికెట్ చూడడంతో మైదానంలో ఉండి చూసినట్లు అనుభూతి వస్తుందని క్రికెట్ ప్రేమికులు సంతోషం వ్యక్తం చేశారు. నిర్వాహకుల ఆలోచనను పలువురు అభినందించారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై అవగాహన



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని జైత్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బోర్దా అవాసంలో ప్రభుత్వం ద్వారా మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణంపై మంగళవారం ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంజూరైన వారు త్వరగా ఇంటిని నిర్మించుకోవాలని, ఇంటి నిర్మాణం కోసం ఇంటి నమూనాపైన అవగాహన కల్పించారు. కొలతల ప్రకారం ఇంటిని నిర్మించాలని, ఇంటి నిర్మాణంపై ఏమైనా సందేహాలుంటే హౌసింగ్ ఏఈని సంప్రదించాలన్నారు. ప్రతి ఒక్కరు ఇంటిని నిర్మించే స్థలం చదును చేసి ఉంచాలని తెలిపారు. ఇల్లు మంజూరైన లబ్ధిదారుల జాబితాను మరోసారి చదివి వినిపించారు. అనంతరం ఇల్లు మంజూరైన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం హౌసింగ్ ఏఈ రత్నం మార్క్ అవుట్ ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శరణ్య, ఏఈ రత్నం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాకతీయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్లు ఎస్.రామస్వామి, వి.కిషన్ హాజరై విద్యార్థులకు సైన్స్ సంబంధిత అంశాలపై అనేక విషయాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఎస్.రామస్వామి మాట్లాడుతూ మన నిత్య జీవితంలో సైన్స్ ఒక విడదీయరాని భాగమని భారత దేశంలో ఇంకా అనేక పరిశోధనలు జరగాల్సి ఉందని వివరించారు. కాకతీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వి.కిషన్ మాట్లాడుతూ మనం నేడు ఆధునిక యుగంలో ఉన్నామని భారతదేశం సైన్స్‌లో వేగంగా పురోగతి సాధిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు విద్యార్థి దశ నుండే శాస్త్రీయ అవగాహన కలిగి ఉండాలని వివరించారు. కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ప్రదర్శనను తిలకించి ఉత్తమ ప్రదర్శనలతో పాటు జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్విజ్, సాంస్కృ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే. శ్రీదేవి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.లక్ష్మీనరసింహం, అకాడమిక్ కోఆర్డినేటర్ డి.జనార్ధన్, అధ్యాపకులు ఎం.రాజేశ్వర్, ఇ. శారద, వి. దేవేందర్, బి.రోజ్‌మేరీ, ఆర్.కృష్ణవేణి, బి.వెంకటేశం పాల్గొన్నారు.



అంగన్‌వాడీలపై నిర్బంధకాండను ఆపాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో మినీ అంగన్‌వాడీల టీచర్లు

మినీ అంగన్‌వాడీలు వారి సమస్యల సాధన కోసం తెలగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో శాంతిపూర్వకంగా వినతిపత్రం అందించడానికి వెళ్తే పోలీసులు అరెస్టు చేయడం సరికాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ అన్నారు. గత 11 నెలలుగా పెండింగ్‌లో ఉన్న మినీ అంగన్‌వాడీల ఏరియాస్ వేతనాలను విడుదల చేయాలనీ, పెరిగిన వేతనాలను వెంటనే అమలు చేయాలని ప్రజా దర్బార్ హైదరాబాద్‌కు వినతిపత్రం ఇవ్వడానికి బయలుదేరుతున్న మినీ అంగన్‌వాడీలను కాగజ్‌నగర్‌లో పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై ఆయన స్పందిస్తు అంగన్‌వాడీలపై నిర్బంధ కాండను ఆపాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు అరెస్టులకు పాల్పడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ నిర్బంధ పాలనకు తెరతీస్తోందన్నారు. ప్రజాపాలన అంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగన్‌వాడీలను అరెస్టులు చేయడం ఏంటని ప్రశ్నించారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలి తప్ప అరెస్టులు చేసి స్టేషన్లలో పెట్టడం, నిర్బంధాన్ని ప్రయోగించడం వల్ల సమస్య పరిష్కారం కాదన్నా సంగతి ప్రభుత్వం గ్రహించాలని కోరారు. జిల్లాలోని ఆయా మండలాల్లో అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేస్తామన్నారు.

నాణ్యమైన విద్యా బోధనకు కృషి చేయాలి



నవతెలంగాణ-కెరమెరి

మారుమూల గ్రామాల్లో విద్యనాభ్యసిస్తున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని మండల విద్యాధికారి అడే ప్రకాష్ అన్నారు. మంగళవారం మండలంలోని పెద్ద పాట్నాపూర్, చిన్న పాట్నాపూర్, జోడేఘాట్‌లోని పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాధికారి ఆయా పాఠశాలల్లోనే మౌలిక వసతులను పరిశీలించారు. నైపుణ్యాలను వెలికితీసేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం తరగతి గదుల్లో జరుగుతున్న విద్యాభోధ తీరును పరిశీలించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో జోడేఘాట్ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆత్రం మోతిరాం, ఉపాధ్యాయులున్నారు.

శత శాతం ఫలితాలకు కృషి చేయాలి



శిక్షణ తీరును పరిశీలిస్తున్న డీడీ రమాదేవి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న పదవ తరగతి పరీక్షల్లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చదువుతున్న విద్యార్థుల శతశాతం ఫలితాల కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని గిరిజన శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రాల్లోని బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతికి బోధించే ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి ఉత్తమ ఫలితాల సాధనకు సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాల కోసం గత నవంబర్ నుండి నిర్వహించిన 100 రోజుల ప్రణాళికను ఉపయోగించుకోవాలన్నారు. రోజువారీగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడంతో పాటు వారిని ఎప్పటికప్పుడు సిద్ధం చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి శ్రద్ధ తీసుకోవాలని కోరారు. జిల్లాలోని 36 ఆశ్రమ పాఠశాలలో 1255 మంది విద్యార్థులు మార్చి 21 నుండి జరిగేపదవ తరగతి పరీక్షలు హాజరుకానునట్లు తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఆరోగ్యంగా మానసిక ధృడత్వం కోసం ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సోమ, మంగళ వారాల్లో జరిగిన వృత్తంత శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలుపరిచి ఉత్తమ ఫలితాలను సాధించాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ సమావేశంలో ఏసీఎంఓఉద్ధవ్, కోర్స్ డైరెక్టర్లు నైతం కృష్ణారావు, కె.రవీందర్, డీఎస్ఓ మీనారెడ్డి, ఎటీడీఓ చిరంజీవి, రిసోర్స్ పర్సన్‌లు సంతోష్, సాగర్, బాలాజీ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనకు ఫలితాలే చెంపపెట్టు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఫలితాలే చెంపపెట్టని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ మద్దతుదారుడు మల్క కొమరయ్య గెలుపొందడంతో మంగళవారం జిల్లా కేంద్రంలోనీ అంబేద్కర్ చౌక్ వద్ద ఆ పార్టీ సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వరరావుతో కలిసి సంబరాలు నిర్వహించారు. టపాకాయలు పేల్చి, స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు. రేవంత్ రెడ్డి మాటలు ఎవరు కూడా నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ నిరుద్యోగులతో పాటు ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తుందని తెలిపారు. అభివృద్ధి చేయడం పక్కనపెట్టి గ్రూపు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీజేపీ గెలుపొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లికార్జున యాదవ్, నాయకులు చర్ల మురళి, పెంటయ్య, ప్రసాద్, ప్రహ్లద్, వెంకన్న పాల్గొన్నారు.

ఉచిత కంటి శిబిరానికి విశేష స్పందన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని కిమ్స్ మల్టిస్పెషలిటీ ఆస్పత్రిలో శ్రీ కొత్తపల్లి వెంకట లక్ష్మీ - చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, డాక్టర్ కొత్తపల్లి అనిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచితం కంటి శిబిరానికి విశేష స్పందన వచ్చింది. పరీక్షలకు 53 మంది హాజరు కాగా వారిలో 36 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి సహకారంతో ఉచితంగా ఆపరేషన్‌లు చేయిస్తామని, ప్రతి మంగళవారం శిబిరాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆప్తమలజిస్ట్ డా.వెంకటేష్, బియ్యల శ్రీనాథ్, ఐ క్యాంప్ ఇన్‌చార్జి గోపి పాల్గొన్నారు.

పాఠశాలలో విజ్ఞాన మేళ

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ విజ్ఞాన మేళను పాఠశాల స్థాయి విద్యార్థులతో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు నమూన ప్రాజెక్టులను ప్రదర్శించి వాటి ఉపయోగం గురించి వివరించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మళ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదగిరి, లక్ష్మీ, సంతోష్, బడే సాహెబ్, ఈశ్వర్‌రావు, నాగరాణి పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
మంచిర్యాల
బుధవారం | మార్చి 05, 2025 | www.navatelangana.com

బాలికలకు పరిశుభ్రతపై అవగాహన

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖలోని జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో పట్టణంలోనిగర్ల్స్ హై స్కూల్‌లో పరిశుభ్రతపైన ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలు పాటించవలసిన ఆహారపు అలవాట్ల గురించి వివరించారు. జిల్లా మహిళా సాధికారత కేంద్ర జిల్లా సమన్వయకర్త సౌజన్య పాల్గొని మాట్లాడుతూ బాలికలు రుతుస్రావం సమయంలో ఎదుర్కొంటున్న సమస్యల గురించి, వారికున్న అపోహల గురించి చర్చించి వారికి సలహాలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు స్నాక్స్, సానిటరీ ప్యాడ్స్ నాప్కిన్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో లటిపేట సిడిపిఓ రేష్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత, మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ విజయ, అకౌంటెంట్ వసంత లక్ష్మి, స్కూల్ హెడ్మాస్టర్ శైలజ పాల్గొన్నారు.

మండల కేంద్రంలో మజ్జిగ పంపిణీ

నవతెలంగాణ-జన్నారం



బీజేవైఎం మండల అధ్యక్షుడు యువ నాయకుడు ముడుగు ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభం అయినందున ప్రతి మంగళవారం వార సంతకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల కోసం వేడి నుండి ఉపశమనం పొందెందుకు మజ్జిగను అందిస్తున్నట్లు ముడుగు ప్రవీణ్ తెలిపారు. మూడు నెలల పాటు ప్రతి మంగళవారం మజ్జిగ అందించ నునట్లు అయన తెలిపారు. వివిధ గ్రామాల నుంచి ప్రతి మంగళవారం సంతకు వచ్చేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళల తోడ్పాటుకు సేవా సమితి



నవతెలంగాణ-జైపూర్

మహిళల సాధికారత, వారి నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి సింగరేణి సేవా సమితి ఎప్పటికి అందుబాటులో ఉంటుందని సేవా అధ్యక్షురాలు సుమిధా శ్రీనివాసులు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం ప్లాంట్ పరిధి ప్రాణహిత అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమిక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్టీపీపీ మహిళా ఉద్యోగులకు, గృహిణులకు, సేవా సభ్యులకు వివిధ రకాలైన ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ఓపెన్ ఆడిటోరియంలో జరుపుకునే వేడుకల్లో మహిళలచే పలు రకాలైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం, ఆట పాటల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎస్టీపీపీ మహిళా ఉద్యోగులు, గృహిణులు అత్యధికంగా ఈ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఠాకూర్ మోహన్ సింగ్, లేడీస్ క్లబ్ సెక్రెటరీ స్రవంతి వేణుగోపాల్, సేవా సమితి కోఆర్డినేటర్ చిలుక అరుణ, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

నవోదయ పాఠశాల ఏర్పాటు చేయాలి

- ఆదిలాబాద్ ఎంపీ నగేష్‌కు వినతి



నవతెలంగాణ-జన్నారం

మండలంలో నవోదయ పాఠశాల ఏర్పాటు చేయాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్‌కు మంగళవారం నవోదయ పాఠశాల సాధన కమిటీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. మండల అభివృద్ధి కమిటీ కార్యవర్గం ఆధ్వర్యంలో మంగళవారం ఆదిలాబాద్‌కు వెళ్లి ఎంపీ గడం నగేష్‌ని మర్యాదపూర్వకంగా కలిసి మండలంలో నవోదయ పాఠశాల ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. అలాగే మండల కేంద్రంలో రోడ్డు డివైడర్లు ఏర్పాటు చేసి సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోడూరి చంద్రయ్య, ఆడెపు లక్ష్మీనారాయణ, శ్రీరాముల కొండయ్య, కన్వీనర్లు లక్ష్మీనారాయణ, ఐలవేణి రవి, ఎంబడి సత్తన్న, బైరి తిరుపతి పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్-2020 స్కీమ్‌పై 25 శాతం రాయితీ

నవతెలంగాణ-లక్షెట్టిపేట

ప్రభుత్వం లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్(ఎల్ఆర్ఎస్) కింద ధరఖాస్తుదారులకు 25 శాతం రాయితీని ప్రకటించిందని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేఅవుట్ రెగ్యులరైజేషన్‌కు భూ యజమానులకు ఆర్థిక ఊరట ఇవ్వడానికి ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్-2020 కింద ఇప్పటికే రూ.1000 చెల్లించి దరఖాస్తు చేసుకున్న, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుదారులకు 25 శాతం రాయితీని ప్రకటించిందని తెలిపారు. పరిమిత కాలం పొందడానికి ఈ నెల 31 వరకు అవకాశం కల్పించిందని తెలిపారు. ఎల్ఆర్ఎస్ కట్ ఆఫ్ తేదీ 26.08.2020కి ముందు కనీసం 10 శాతం లేఅవుట్ ప్లాట్లు విక్రయించిన భూ యజమానులు, మిగిలిన ప్లాట్లను రిజిస్ట్రేషన్ సమయంలో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపారు.

ఐటీడీఏ పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీడీఓ



నవతెలంగాణ-జన్నారం

ఉత్తమ ఫలితాల రాబట్టేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేయాలని ఎంపీడీఓ ఉమర్ షరీఫ్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలను సోమవారం రాత్రి పరిశీలించారు. విద్యార్థుల స్టడీ అవర్స్, భోజనాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన అక్కడే బస చేశారు. ఆయనతో పాటు ప్రిన్సిపల్ శివ రాజన్న ఉన్నారు.

సకాలంలో పన్నులు కట్టి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలి

నవతెలంగాణ-జన్నారం



పన్నులు సకాలంలో కట్టి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని మండలంలోని రేండ్లగూడ గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ నాయక్ కోరారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం గ్రామస్థుల వద్ద ఇంటి పన్ను వసూలు చేశారు. మార్చి 31న ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో ప్రజలు, వ్యాపారులు వారి ఇంటి, వ్యాపార ట్రేడ్ లైసెన్సుల పన్నులను కట్టాలన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రజలు సహకారం అందించాలని కోరారు.

పెన్షన్ పే ఆర్డర్లు అందేదెప్పుడు..?

- సింగరేణి రిటైర్డ్ కార్మికులు ఎదురుచూపు
- అధికారుల దాటవేత ధోరణితో మనస్థాపం
- యాజమాన్యం చొరవ చూపాలని వేడుకోలు

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి కార్మికులుగా పదవీ విరమణ పొందిన వారు కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం నుంచి పొందాల్సిన పెన్షన్ పే ఆర్డర్ల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. సంవత్సరాలు గడిచి పోతున్నా పెన్షన్ పే ఆర్డర్లు అందకపోవడంతో రిటైర్డ్ కార్మికులను నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారు. 11వ వేజ్ బోర్డు వేతన ఒప్పందంతో పాటు గతంలో పదవీ విరమణ పొందిన కార్మికులు పెన్షన్ పే ఆర్డర్ల కోసం ఎదురు చూస్తున్నారు. సింగరేణి సంస్థ ద్వారా రిటైర్డ్ అయిన కార్మికులకు సంబంధించిన వివరాలు కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయానికి సంబంధిత గని, డిపార్ట్‌మెంట్ ద్వారా పంపాల్సివుంటుంది. కార్మికుడు పని చేసిన గని, డిపార్ట్‌మెంట్ ద్వారా అందిన వివరాల ప్రకారం కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం నుంచి పెన్షన్ పే ఆర్డర్ (సెటిల్మెంట్) అందుతుంది. అయితే రిటైర్డ్ కార్మికులకు సంబంధించిన వివరాలను సంబంధిత గని, డిపార్ట్‌మెంట్ నుంచి కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయానికి సకాలంలో పంపడంలో సింగరేణి అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని తెలియవస్తోంది. శ్రీరాంపూర్ ఏరియా పరిధికి సంబంధించి 11వ వేజ్‌బోర్డు వేతన ఒప్పందం ప్రకారం 2,106 మంది కార్మికులు సింగరేణి సంస్థ ద్వారా పదవీ విరమణ పొందారు. ఇందులో నుండి 1138 మంది కార్మికులకు సంబంధించి పెరిగిన వేతనాల ప్రకారం పెన్షన్ క్లైమ్స్ కోసం గోదావరిఖనిలో గల కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయానికి సింగరేణి యాజమాన్యం నివేదించింది. మిగితా 968 మంది కార్మికుల వివరాలను కోల్‌మైన్స్ ప్రావిడెంట్ పండ్ కార్యాలయానికి సింగరేణి యాజమాన్యం పంపించాల్సిఉంది. వివరాలు లేకపోవడంతో యాజమాన్యం పంపడంలేదని పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

1138 మందిలో 83 మాత్రమే క్లైమ్స్

11వ వేజ్‌బోర్డు వేతన ఒప్పందం ప్రకారం రిటైర్డ్ అయిన 2106 మంది కార్మికుల్లో 1138 మంది కార్మికుల వివరాలు కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయానికి పంపించినట్లు సింగరేణి యాజమాన్యం చెప్పుకొస్తుంది. ఇందులో కేవలం 83 మందికి మాత్రమే క్లైమ్స్ అయ్యాయి. మిగితా వారికివి సెటిల్‌మెంట్ కాకపోవడం ఏమిటి..? మిగిలినవి కూడ సెటిల్‌మెంట్ చేయించడం సింగరేణి యాజమాన్యం బాధ్యత కాదా అనే ప్రశ్న తలెత్తుతోంది. అదేవిధంగా 968 మంది రిటైర్డ్ కార్మికులు సంబంధిత గని, డిపార్ట్‌మెంట్లను సంప్రదించడ లేదని చెప్పుకొస్తున్న సింగరేణి యాజమాన్యం వారికి సంబంధించిన రివైజ్డ్ పెన్షన్ సెటిల్మెంట్ బాధ్యతగా స్వీకరించదా..? అనే వాదనలు కూడా లేకపోలేదు. వివరాలు అందుబాటులో లేవని చెబుతున్న అధికారులు సంబంధిత గనులు, డిపార్ట్‌మెంట్ అధికారులను సమాయత్త పర్చాల్సిన బాధ్యతను ఎందుకు తీసుకోవడం లేదని బాదితులు ప్రశ్నిస్తున్నారు.. కేవలం సమాచారం అందుబాటులో లేదంటూ తప్పించుకోవడం తప్పా పదవీ విరమణ పొందిన కార్మికునికి నేరుగా సమాచారం ఇవ్వడంలో నిర్లక్షం చేస్తున్నారు. ఒక్క శ్రీరాంపూర్ ఏరియాలో పరిస్థితి ఈ విధంగా ఉంటే సింగరేణి వ్యాప్తంగా ఉన్నటువంటి 11 ఏరియాల్లో గల పరిస్థితి ఏవిధంగా ఉందో ఆలోచించాల్సిన అవసరం ఎంతైనాఉంది.

దాటవేత ధోరణి కన్పిస్తోంది



వేణుమాధవ్, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి

సింగరేణి అధికారుల్లో దాటవేత ధోరణి కన్పిస్తోంది. ఏదైనా సమస్య పట్ల స్పష్టమైన సమాధానం ఇవ్వకపోవడం కలిగిస్తోంది. శ్రీరాంపూర్ ఏరియా పరిధిలో 11వ వేతన ఒప్పందం ప్రకారం రిటైర్డ్ అయిన కార్మికులకు రివైజ్డ్ పెన్షన్ క్లైములు వివరాలు అడిగితే కట్టే, కొట్టే, తేచ్చే అన్నట్లుగా సమాధానం ఇస్తున్నారు. 2025 ఫిబ్రవరి 19 వరకు సింగరేణి వద్ద ఉన్న సమాచారం ప్రకారం శ్రీరాంపూర్ ఏరియా పరిధిలో 11వ వేజ్‌బోర్డు ఒప్పందం ప్రకారం 2106 మంది కార్మికులు పదవీ విరమణ పొందారు. ఇందులో సగం మందికి సంబంధించిన వివరాలు మాత్రమే కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయానికి పంపించారు. అదేమంటే మిగితా వారి వివరాలు అందుబాటులో లేవంటూ సంబంధిత గనులు, డిపార్ట్‌మెంట్ల మీదికి తోస్తున్నారు. సంస్థలో పని చేసినంత వరకు మాత్రమే పదవీ విరమణ పొందితే వారికి మాకు ఎలాంటి సంబంధం లేనట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో సింగరేణి సీఎండీ బలరామ్ చొరవ చూపించాలి. సంస్థను విడిచిన కార్మికులకు న్యాయం చేయాల్సిన బాధ్యతను విస్మరించడం సరికాదు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా విద్యా శాఖ అధికారి యాదయ్య

నవతెలంగాణ-జన్నారం

2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతి విద్యార్థులు 10/10 జీపీఏ సాధించాలని మంచిర్యాల డీఈఓ యాదయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈఓ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తుందని విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులను కోరారు. క్వాలిటీ టీచర్స్ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్నార అన్నారు. పేద బడుగు బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందాలంటే ప్రభుత్వ పాఠశాలల్లో వారి పిల్లలను చేర్పించాలన్నారు. బాలికల పాఠశాలలో ప్రభుత్వం అన్ని రకాలైన రక్షణ చర్యలు తీసుకుంటుందన్నారు. మంచి విద్యను అందిస్తున్న ఉపాధ్యాయులకు మంచి గౌరవం లభిస్తుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రతి పదవ తరగతి విద్యార్థి 10/10 జీపీఏ సాధించి, మంచిర్యాల జిల్లాలోనే జన్నారం ప్రభుత్వ బాలికల పాఠశాలల ప్రథమ స్థానంలో నిలవాలని కోరారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి విజయకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొల్ల రామన్న, ఎస్ఓలు చౌదరి, యశోద, సత్యనారాయణ మూర్తి, కలమడుగు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్ట రాజమౌళి, నాయకులు దాముఖ కమలాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి



నవతెలంగాణ-జైపూర్

మండల పరిధిలో కొనసాగుతున్న ఎల్‌ఆర్‌ఎస్ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని డీఎల్‌పీఓ ధర్మారాణి ఆదేశించారు. మండల పరిధి నర్వ జైపూర్, ఇందారం గ్రామాలను మంగళవారం సందర్శించిన ఆమె ఎల్‌ఆర్‌ఎస్ సర్వే తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. అదేవిధంగా మార్చి 31 నాటికి గ్రామ పంచాయతీల వారిగా ఇంటి పన్ను వసూళ్లు వంద శాతం పూర్తి చేయాలని అన్నారు. ఇంటి పన్ను వసూళ్లు చేయడంలో తాత్సారం చేయరాదని, వసూలు చేసిన నగదును గ్రామ పంచాయతీ బ్యాంకు ఖాతాలో ఎప్పటికప్పుడు జమ చేయాలని తెలిపారు. గ్రామ పంచాయతీల వారిగా పెండింగ్‌లో ఉన్నటువంటి ఎల్ఆర్ఎస్ ధరఖాస్తులు, ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన ధరఖాస్తుల్లో పెడింగ్‌కు గల కారణాలు అడిగి తెల్సుకున్నారు. మిగిలివున్న ధరఖాస్తుల సర్వే 4 రోజుల్లో పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీల పరిధిలో చేపడుతున్న పారిశుధ్య పనులు పరిశీలించారు. గ్రామ పంచాయతీల పరిధిలో నిరంతరాయంగా పారిశుధ్య పనుల నిర్వాహణ కొనసాగాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు, వివిధ గ్రామాలకు చెందిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు సుమన్, ప్రవీణ్, శివ్వారం, విష్ణువర్ధన్, సాయి కిరణ్, రమాదేవి, సురేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి



నవతెలంగాణ-తాండూర్

విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని బెల్లంపల్లి తహసీల్దార్ జ్యోత్స్న అన్నారు. మంగళవారం కస్తూర్బా గురుకులాన్ని సందర్శించారు. అక్కడి వసతి సౌకర్యాలను వంటశాల పరిసరాలను భోజన ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలకు హాజరుకావాలని సూచించారు. ప్రణాళిక బద్దంగా చదివి మంచి ఫలితాలను సాధించాలన్నారు. అలజడి అశాంతి వల్ల జ్ఞాపక శక్తి క్షీణిస్తుందని ప్రశాంతతతో ప్రణాళిక బద్దంగా పరీక్షలకు సన్నద్ధం కావాలని తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని బోధన సిబ్బందికి సూచించారు. మంచినీరు సులువుగా జీర్ణం అయ్యే భోజనాన్ని అందించాలని తెలిపారు. తహసీల్దార్ వెంట ఎస్ఓ రజిత ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



నవతెలంగాణ-తాండూర్

విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ సూచించారు. మంగళవారం మండలంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేశారు. ఎంపీడీఓ శ్రీనివాస్ సీఐ కుమారస్వామి, ఎస్ఐ సౌజన్య పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఇంటర్ పరీక్షల్లో మంచి ప్రతిభను కనబరిచి జిల్లాలోని తాండూర్ మండలాన్ని మొదటి స్థానంలో నిలబెట్టాలని కోరారు. విద్యార్థినులు ఆందోళన భయాన్ని వదలి మానసిక ప్రశాంతతో పరీక్షలకు హాజరు కావాలన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ప్రశాంతమైన వాతావరణం నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎస్ఓ కవితకు సూచించారు. బోధన సిబ్బంది ప్రణాళిక బద్ధంగా పిల్లలను పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు.

వరి పంటల పరిశీలన



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ధర్మరావుపేట గ్రామంలో వరి పంటను మండల వ్యవసాయాధికారి చల్ల ప్రభాకర్ మంగళవారం పరిశీలించారు. వరి పంటలను పరిశీలించిన ఏఓ రైతులకు పలు సూచనలు చేశారు. వరి పంట ప్రస్తుతం పిలక దశలో ఉందని, ప్రస్తుతం అక్కడక్కడ కాండం తొలిచే పురుగు పట్టిందని, దీని నివారణకు క్లోరాన్రిలిప్రోల్ శాతం గుళికలు 4 కిలోలు ఒక ఎకరాకు చల్లాలని లేదా క్లోరాన్రిలిప్రోల్ 60 మి.లీ లేదా ఐసోసైక్లోసెరమ్ 18 శాతం ఎస్సీ 120 మిల్లీ లీటర్ను 200 లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని సేచించారు. ఎదుగుదల లోపించి ఆకులు ఎండినట్లు కనిపిస్తే నివారణకు పొలాన్ని వెంట్రుక మందం పగుళ్లు వచ్చేంత వరకూ ఆరబెట్టి మళ్ళీ నీళ్ల ఇవ్వాలని, అలాగే జింకులోప నివారణకు వరి నాటిన 45 రోజుల లోపు చెలామిన్ జింక్ 400 గ్రాములు 200 లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

నవతెలంగాణ-మందమర్రి

రోడ్డు నిబంధనలను పాటిస్తూ ప్రమాదాలను అరికట్టాల్సిన బాద్యత ప్రతీ ఒక్కరిపై ఉందని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. 54వ జాతీయ భద్రతా వారోత్సవాలు 2025ని పురస్కరించుకొని మంగళవారం మందమర్రి టోల్ గేట్ దగ్గర జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భద్రతా అవగాహనను పెంచడానికి, ప్రమాదాలను తగ్గించడానికి 1971లో నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రతి సంవత్సరం మార్చి 4న జాతీయ భద్రతా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రహదారి భద్రత గురించి ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన కూడా 2024 సంవత్సరం బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలోని జాతీయ రహదారి 363 మీద ప్రమాదాలతో 54 మంది మరణించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్, జాతీయ రహదారి నిర్వహణ అధికారులు సునీల్, సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కర్మాగారంలో 54వ జాతీయ భద్రతా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓరియంట్ కంపెనీ యూనిట్ హెడ్ బాల గిరిధర్ భద్రతా జెండా ఆవిష్కరించి భద్రతా వారోత్సవాలను ప్రారంబించారు. అనంతరం ఏర్పాటు చేసిన



జైపూర్ : ఎస్టీపీపీలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఇన్‌చార్జి ఈడీ

కార్యక్రమంలో యూనిట్ హెడ్ బాలగిరిధర్ మాట్లాడుతూ దేశ అభివృద్ధికి భద్రతా శ్రేయస్సు కీలకమన్నారు. అందరూ భద్రతా నియమ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని డీఏవీ పాఠశాల విద్యార్థులకు, ఉద్యోగులకు, వర్కర్లకు వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం ఉద్యోగులు, కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. వారోత్సవాల సందర్భంగా 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలతో పాటు భద్రతా పోటీలు జరుపుతామని ఓరియంట్ సిమెంట్ భద్రతా అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ సీనియర్ జీఎం ఆనంద్ కులకర్ణి, డీఏవీ ప్రిన్సిపాల్ కిరణ్ పాల్గొన్నారు.

వ్యక్తిగత భద్రతకు మొదటి ప్రాధాన్యత

జైపూర్ : సింగరేణి యాజమాన్యం ఉద్యోగుల వ్యక్తిగత భద్రతకు మొదటి ప్రాధాన్యతనిస్తుందని ఎస్టీపీపీ ఇన్‌చార్జి ఈడీ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ప్లాంట్ అధికారులతో కలిసి 54వ జాతీయ భద్రతా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా సేఫ్టీ ఫ్లాగ్ ఆవిష్కరించిన అనంతరం ఉద్యోగులతో కలిసి భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. విధి నిర్వాహణ, నిత్య జీవితంలో ప్రతి ఉద్యోగి భద్రత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఉద్యోగి భద్రంగా ఉన్నప్పుడే అతనిపై ఆదారపడిన కుటుంబ సభ్యులు భద్రంగా ఉంటారని తెలిపారు. ఉద్యోగి భద్రత తర్వాతనే ఉత్పత్తి ఉత్పాదకత అని అన్నారు. సింగరేణి ఇదే అవలంభిస్తోందని పేర్కొన్నారు. భద్రతా ప్రమాణాలు పాటిస్తే సంస్థ అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ చీఫ్ ఓఅండ్ఎం జేఎన్ సింగ్, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి సత్యనారాయణ, సీఎంఓఏఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ సుముద్రాల శ్రీనివాస్, పీఎంపీఎల్ ప్లాంట్ హెడ్ అఖిల్ కపూర్, డీజీఎం పర్సనల్ అజ్మీరా తుకారాం పాల్గొన్నారు.

జీఎంను సన్మానించిన కాంట్రాక్టర్స్ అసోసియేషన్

నవతెలంగాణ-రెబ్బెన



బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎం.విజయభాస్కర్ రెడ్డిని సింగరేణి సివిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్, బెల్లంపల్లి (గోలేటి)ఏరియా కాంట్రాక్టర్స్ ఆధ్వర్యంలో సన్మానించారు. గోలేటిలోని ఏరియా జీఎం కార్యాలయంలో జీఎంకు పుష్పగుచ్ఛమిచ్చి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా సివిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు ముక్కు గోపికృష్ణారెడ్డి, ఆది శ్రీనివాస్ రావు, ముత్యాల పైడిధర్, రామగౌని మహిధర్ గౌడ్, అల్లాడి రాజేష్, పరకాల సాగర్ గౌడ్, ఉడుత రాజేష్, గాంధర్ల కిరణ్ కుమార్, రమేష్, సంతోష్, సుధాకర్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

గంజాయి సాగు కేసులో వ్యక్తికి ఏడేండ్ల జైలు

నవతెలంగాణ-జైనూర్

సిర్పూర్-యు పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సాగు చేసిన కేసులో వ్యక్తికి ఏడు సంవత్సరాలు జైలుతో పాటు రూ.50 వేల జరిమాన విధిస్తూ డిస్ట్రిక్ సెషన్స్ కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్ తీర్పు ఇచ్చారని సిర్పూర్ (యు) ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గతంలో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న విష్ణువర్ధన్ పోలీస్ సిబ్బందితో 24 అక్టోబర్ 2021న మధుర తాండ గ్రామ శివారులో పత్తి చేనులో గంజాయి సాగు చేస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీ నిర్వహించారు. మఠావాన్ భానుదాస్ చిన్న బోథ గ్రామానికి చెందిన సోయం లక్ష్మణ్‌కు చెందిన నాలుగు ఎకరాల పొలంను భానుదాస్ కౌలుకు తీసుకొని పత్తి పంట సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో గంజాయి పంట సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని, లాభాపేక్షతో పత్తి పంటలో గంజాయిని సాగు చేశాడు. తనిఖీ చేసి అతనిపై కేసు నమోదు చేశారు. ప్రస్తుత జైనూర్ సీఐ, సిర్పూర్-యు ఎస్‌ఐ సాక్షులను కోర్టులో హాజరుపరచగా పీపీ జగన్ మోహన్ రావు నేరాన్ని రుజువు చేయడంతో నిందితుడికి ఏడు సంవత్సరాలు జైలుతో పాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

నేటి నుండి ఇంటర్ పరీక్షలు

- నిమిషం నిబంధన సడలింపు
- జిల్లాలో 31 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- హాజరుకానున్న 18880 మంది విద్యార్థులు



పరీక్ష కేంద్రంలో నంబర్లు వేస్తున్న అధికారులు

నవతెలంగాణ -ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 5 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అధికారులు పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు. ప్రాక్టికల్ పరీక్షలతో పాటు ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీషు ప్రాక్టికల్ పరీక్ష, పర్యావరణ విద్య పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. థియరీ పరీక్షలపై కలెక్టర్ రాజర్షి షా సమీక్ష నిర్వహించగా, జిల్లా ఇంటర్ విద్యాధికారి సైతం నిర్వాహకులకు అవగాహన కల్పించారు.

సీసీ నిఘాలో పరీక్షలు..

మార్చి 5 నుండి మార్చి 25 వరకు జరిగే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షా కేంద్రాలను సీసీ కెమెరాలతో పర్యవేక్షించనున్నారు. నిమిషం నిబంధన ఈసారి సడలించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో అవసరమైన మెడికల్ సదుపాయాలతో పాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నారు. వేసవికాలం నేపథ్యంలో విద్యార్థులకు తాగునీటి సౌకర్యం, టాయిలెట్ సౌకర్యం కల్పించారు.

పరీక్షకు 18,880 మంది విద్యార్థులు

ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 31 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా జిల్లాలోని ప్రభుత్వ ప్రయివేట్ కాలేజీల్లో జనరల్, ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 18880 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. వారిలో ఫస్టియర్ జనరల్ విద్యార్థులు 8093 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1013 మంది ఉన్నారు. అలాగే ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 8754 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1020 మంది ఉన్నారు. పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉండగా, విద్యార్థులను 8 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతించనున్నారు.

వెబ్ నుండి హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకోవచ్చు

ప్రైవేట్ కళాశాలలు హాల్ టికెట్లు ఇవ్వని విద్యార్థులు నేరుగా ఇంటర్‌నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇందుకు సంబంధించిన ఆదేశాలను పరీక్షల నిర్వహణ కేంద్రాలకు ఉన్నతాధికారులు జారీ చేశారు. విద్యార్థులు టీఎస్‌బీఐఈ.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. హాల్ టికెట్‌పై సంతకం లేకున్న పరీక్ష రాసే వీలు కల్పించారు.

పరీక్షల నిర్వహణకు అధికారుల నియామకం

జిల్లాలో ఇంటర్ పరీక్షల కోసం అవసరమైన అధికారులకు విధులను కేటాయిస్తూ జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి సెంటర్‌కు ఒక సూపరింటెండెంట్ చొప్పున జిల్లాలో 31 మందిని నియమించారు. వారితో పాటు మరో 31 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్కాడ్‌లు, సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. అలాగే గ్రామాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాట్లు చేశారు.

ఎలక్ట్రానిక్ వాటికి అనుమతి నిరాకరణ

విద్యార్థులు తమ హాల్ టికెట్లను టీఎస్‌బీఐ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు గంట ముందుగానే చేరుకోవాలి. విద్యార్థితో హాల్‌టికెట్, పెన్, పెన్సిల్, రబ్బర్, ఎగ్జామ్ ప్యాడ్, మ్యాథమెటికల్ పరికరాలు మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. నోటు బుక్కులు, సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి లేదని అధికారులు స్పష్టం చేశారు. ఈ విషయాలను విద్యార్థులు గుర్తించాలని సూచించారు.

మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకుంటాం



జాదవ్ గణేష్ కుమార్, ఇంటర్ బోర్డు విద్యాధికారి

పరీక్షల నిర్వహణకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇంటర్‌నెట్ ద్వారా హాల్ టికెట్ పొందిన విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించేలా బోర్డు నిర్ణయం తీసుకున్నది. బోర్డు నిబంధనల ప్రకారం ఈసారి ఒక్క నిమిషం నిబంధన సడలించారు. మాస్ కాపీయింగ్ జరుగకుండా చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులు ఎలాంటి భయం లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి. ఈసారి మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం.

ఘనంగా విద్యుత్ లైన్‌మెన్ డే వేడుకలు



నవతెలంగాణ-రెబ్బెన

విద్యుత్ లైన్‌మెన్ డేను పురస్కరించుకొని సబ్ స్టేషన్‌లో పనిచేస్తున్న లైన్‌మెన్‌లను ఏఈ ఇమ్రాన్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థలో క్షేత్ర స్థాయిలో పని చేసే యుద్ధ వీరులు అన్‌మ్యాన్డ్, ఆర్టిజన్స్, జెఎల్‌ఎం, ఏఎల్ఎం, ఎల్ఎం, సీనియర్ ఎల్ఐ, ఫోర్‌మెన్ నిత్యం నాణ్యమైన, అంతరాయంలేని విద్యుత్ సరఫరా అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. భద్రతాపై అవగాహన పెంచుకోవాలని, నిబంధనలు పాటిస్తు శిక్షణ పొంది సహ ఉద్యోగులకు అప్రమత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో ఫోర్‌మెన్ గ్రేడ్ వన్ లైన్‌మెన్ ఇన్స్‌పెక్టర్ సీహెచ్ రమేష్, సురేష్, రాజశేఖర్, లైన్‌మెన్ మల్లయ్య, అసిస్టెంట్ లైన్‌మెన్ సురేష్ కుమార్, మూతిరామ్, హరీష్ పాల్గొన్నారు.

కార్మికులను వేధిస్తున్న డీఎంపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కార్మికులను వేధిస్తున్న ఆర్టీసీ డీఎంపై చర్య తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ డిమాండ్ చేశారు. టీజీఎస్ఆర్టీసీ ఎండీ కార్యాలయంలో ఈడీ మునీశ్వర్‌కి వినతిపత్రం అందజేశారు. డిపోలో కార్మికులుగా గత సంవత్సర కాలం నుండి డిపో మేనేజర్ వేధింపులకు గురి చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడా లేని విధంగా కార్మికులపై పని భారం మోపుతూ మానసికంగా వేధిస్తున్నారన్నారు. పనిఒత్తిడి తట్టుకోలేక అనారోగ్యానికి గురౌతున్నారని తెలిపారు. ఆసిఫాబాద్ నుండి హైదరాబాద్ నడిచే సర్వీసుల్లో మూడు రోజుల డ్యూటీ చేసేవారని, డ్రైవర్లకు, కండక్టర్లకు ఒక రోజు విశ్రాంతి ఇచ్చేవారని, ప్రస్తుతం విశ్రాంతి ఇవ్వకుండా నిరంతరాయంగా విధులు నిర్వహించాలని ఒత్తిడి చేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రీజనల్ మేనేజర్ కూడా వంత పాడుతున్నారని ఆరోపించారు. డిపోలో పరిస్థితి చక్క దిద్ది కార్మికులను రక్షించాలని కోరారు. డిపో మేనేజర్‌పై చర్యలు తీసుకోకుంటే రానున్న రోజుల్లో కార్మికులతో కలిసి బస్ భవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, డిపో కార్మికులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా పోస్టులపై పోలీసులు స్పందించాలి

నవతెలంగాణ- కాగజ్‌నగర్

సోషల్ మీడియాలో సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబుపై అనుచిత వ్యాఖ్యలతో కూడిన పోస్టులు పెడుతున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షులు శివ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియా పోస్టులపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాజకీయాలలో వ్యక్తిగత ఆరోపణలకు తావు లేదని, తాము కూడా వ్యక్తిగత ఆరోపణలకు దిగితే ఎదుటి వాళ్ళ తలెత్తుకొని తిరగని పరిస్థితి వస్తుందన్నారు. విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించి ఇక్కడ ఎమ్మెల్యేగా గెలుపొంది అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న హరీష్ బాబు ఎదుగుదలను చూసి ఓర్వలేని వారు ఇలాంటి చవకబారు పోస్టింగులు పెడుతూ మానసిక ఆనందం పొందుతున్నారని తెలిపారు. తాను ఈ నెల ఒకటవ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఇప్పటివరకు పోలీసులు చోద్యం చూస్తూ ఉండడం సరి కాదన్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి చర్యలు తీసుకోని పక్షంలో అనంతర పరిణామాలకు వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఎంఈఓ రాథోడ్ సుభాష్ మాట్లాడుతూ విద్యార్థులు రానున్న పదవ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి పాఠశాలకే కాకుండా తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుభాష్, ఉపాధ్యాయులు హేమంత్ షిండే, వాణి, శ్రీదేవి, పుష్ప, పద్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విస్తృత ఉపన్యాసం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విస్తృత ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.రామస్వామి విస్తృతోపన్యాస కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ ఇలాంటి విస్తృత ఉపన్యాసాల వలన విద్యార్థులకు ఆసక్తి, విషయపరిజ్ఞానం పెరుగుతుందని, అదనపు జ్ఞానం అందుతుందని పేర్కొన్నారు. ఇందులో ప్రొఫెసర్ రామస్వామి, వృక్ష శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ దేవేందర్ రెడ్డి, అధ్యాపకులు నర్సింగరావు, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మీనరసింహం పాల్గొన్నారు

బీజేపీ సంబరాలు

నవతెలంగాణ-రెబ్బెన

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ నుండి మల్క కొమురయ్య ఎమ్మెల్సీగా గెలుపొందిన సందర్భంగా మండల అధ్యక్షుడు మల్రాజ్ రాంబాబు ఆధ్వర్యంలో జడ్పిహెచ్ఎస్ ఉపాధ్యాయులతో స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కో కన్వీనర్ కొలిపాక కిరణ్, సునీల్ చౌదరి, నాయకులు పాల్గొన్నారు.

ఆ బంకులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా పెట్రోల్ బంక్ యాజమానులు బంకులు నడుపుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ, టీఏజీఎస్, కేవీపీఎస్, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి కలెక్టరేట్ ఏఓ మధుకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పెట్రోల్ బంకులు కనీస నిబంధనలు పాటించడం లేదన్నారు. వినియోగదారులకు తాగునీటి సౌకర్యం, ఫ్రీ ఎయిర్, మరుగుదొడ్ల మూత్రశాలలు కల్పించడం లేదన్నారు. అరకోర సౌకర్యాలతో బంకులు నడిపిస్తున్నారన్నారు. వాహనదారుల వద్ద బంకు సౌకర్యాల నిమిత్తం, పన్ను రూపంలో వసూలు చేసిన్న సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, టీఏజీఎస్ జిల్లా అధ్యక్షులు కొరెంగ మాల్‌శ్రీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గేడం టీకానంద్, టీఏజీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఏఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మారుమూల గ్రామాల ప్రజలకు వైద్యమందాలి

- డీఎఫ్ ఓ నీరజ్ కుమార్



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎఫ్ఓ నీరజ్ కుమార్

నవతెలంగాణ-బెజ్జూర్

మారుమూల గ్రామాల పేద ప్రజలకు వైద్యం అందించాలనే ఉద్దేశంతో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు డీఎఫ్ఓ నీరజ్ కుమార్ టిబ్రివల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో అటవీ శాఖ, సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల ప్రజలు వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారనే ఉద్దేశంతో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ వైద్య క్యాంపు రెండు రోజుల పాటు కొనసాగుతుందని, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరానికి సహకరించిన వైద్యులకు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ ఎఫ్‌డీఓ సుశాంత్ సుఖ్‌దేవ్, సింగరేణి సంస్థ సూపరింటెండెంట్ మధు కుమార్, బెల్లంపల్లి ఏరియా సింగరేణి అధికారి విజయభాస్కర్, పర్సనల్ ఇన్‌చార్జి రెడ్డిమల్ల తిరుపతి, డాక్టర్లు రాధాకృష్ణ, స్టాలిన్, శ్రీదేవి, బెజ్జూర్ రేంజ్ అధికారి ముసవీర్, డిప్యూటీ రేంజ్ అధికారి శ్రావణ్ కుమార్, సెక్షన్ అధికారలు సంతోష్ కుమార్, మల్లికార్జున్, బీట్ ఆఫీసర్లు వెంకటేష్, గోపాల్, వెంకటేష్, సంతోష్, మురళి, మాలీ సంఘం అధ్యక్షులు కొట్రంగి రామకృష్ణ, సింగరేణి సంస్థ వైద్య సిబ్బంది, రోగులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. నేటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు సంబంధించి మంగళవారం సంబంధిత అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్ల పై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు సమయానుకూలంగా రవాణా సదుపాయం అందుబాటులో ఉండేలా బస్సులు నడిపించాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని నిర్దీత సమయానికి సకాలంలో ప్రశ్నపత్రాలు కేంద్రాలకు చేరేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పోస్టల్ అధికారులు ప్రశ్నా పత్రాలను జాగ్రత్తగా



తరలించాలని, పరీక్షలు ప్రారంభం అయ్యే సమయానికి ముందే విద్యార్థులు తమకు కేటాయించబడిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాల లో అనుమతి లేదని స్పష్టం చేశారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, డీఐఈఓ గణేష్, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత, అధికారులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ అమలు

ఇంటర్ పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలో 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వెలుపల ప్రాంతాలలో పోలీసు సిబ్బంది బందోబస్తులో ఉంటారని తెలియజేశారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో జిరాక్స్ సెంటర్లను, ఇంటర్నెట్ సెంటర్లను మూసి ఉంచాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద ప్రజలు 500 మీటర్ల వరకు గుమ్మిగూడి ఉండకుండా ఉండాలని తెలిపారు. పరీక్షా కేంద్రం లోనికి వెళ్లే సమయంలో ప్రధాన గేటు వద్ద జిల్లా పోలీసులు బందం తనిఖీ నిర్వహిస్తుందని వారికి సహకరించాలని సూచించారు. విద్యార్థులందరూ పరీక్షలలో తమ ఉత్తమ ప్రతిభ కనబరచాలని ముందుగా అందరికీ శుభాభినందనలు తెలియజేశారు.


ఈవీఎం గోదాంను పరిశీలించిన నిర్మల్ కలెక్టర్

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సమీపంలోని ఈవీఎం గోదాంను మంగళవారం కలెక్టర్ అభిలాష అభినవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గోదాం వద్ద భద్రత సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహించాలని సూచించారు. షిఫ్టుల వారీగా భద్రతను పర్యవేక్షించాలని, సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, ఇతర సామాగ్రికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా గోడౌన్‌లో పూర్తి స్థాయిలో భద్రత కల్పించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, భద్రతా సిబ్బంది, అధికారులున్నారు.



ఇంటర్ పరీక్షకు సర్వం సిద్ధం



నవతెలంగాణ-జైనూర్

నేటి నుంచి ఇంటర్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేశామని సిర్పూర్-యు పీఎంశ్రీ మోడల్ స్కూల్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటస్వామి తెలిపారు. సిర్పూర్ యు మండల కేంద్రంలో ఉన్న మోడల్ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 174, ద్వితీయ సంవత్సరంలో 154 మొత్తం 328 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. అదేవిధంగా జైనూర్ మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో చదువుతున్న మొదటి సంవత్సరంలో 347, ద్వితీయ సంవత్సరంలో 343 విద్యార్థులు పరీక్షకు రాయనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జామినేషన్ ఇన్‌చార్జిలు షేక్ ఇమ్రాన్, రాథోడ్ సత్యపాల్ ఉన్నారు.

మ్యూజియంలో ఆసిఫాబాద్ విద్యార్థుల సందడి



నవతెలంగాణ-కెరమెరి

ఆదివాసుల ఆరాధ్య దైవం, కుమురం భీం అసువులు బాసిన పోరుగడ్డను మంగళవారం ఆసిఫాబాద్ గిరిజన సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా జోడేఘాట్‌లోని మ్యూజియంలో భద్రపరచిన 9 తెగలకు చెందిన సాంప్రదాయ ఆభరణాలు, పనిముట్లు, భీం అనుచరుల ప్రతిమలను ఆసక్తిగా తిలకించారు. భీం పోరాట పటిమను అడిగి తెలుసుకున్నారు.

సమీకృత గురుకులాన్ని ఏర్పాటు చేయాలి : మాజీ సర్పంచ్



నవతెలంగాణ-ముథోల్

ముథోల్ తాలూకా కేంద్రంలో సమీకృత యంగ్ ఇండియా గురుకులాన్ని ఏర్పాటు చేయాలనీ మహాత్మా జ్యోతి బాపులే ప్రజావాణి-ప్రజాభావన్ హైదరాబాద్‌లో మంగళవారం నోడల్ అధికారికి ముథోల్ మాజీ సర్పంచ్ వేంకటపూర్ రాజేందర్ వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే పలుమార్లు స్థలసేకరణకు జిల్లా మండల అధికారులు వచ్చి గురుకులం పక్కన స్థలం చూసినా ఏర్పాటుకు నోచుకోలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గురుకులాల ఏర్పాటులో ముథోల్‌లో కూడాఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మంచిర్యాల

బుధవారం | మార్చి 05, 2025 | www.navatelangana.com

మహిళలకు ఆటల పోటీలు

నవతెలంగాణ-మందమర్రి



మహిళా దినోత్సవ వేడుకలలో భాగంగా మంగళవారం సీఈఆర్ క్లబ్ ఆవరణలో మహిళలకు ఆటల పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జి స్వరూప రాణి దేవేందర్ హాజరై మాట్లాడారు. ముందుగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి పోటీలను ప్రారంభించారు. గ్లాస్ బాల్, బాల్ స్ట్రా, గ్లాస్ ఆన్ హెడ్, బాంబ్ ఇన్ బ్లాస్ట్ పోటీలు నిర్వహించగా ఏరియాలోని 200 మంది మహిళలు, సింగరేణి మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 8 బహుమతి ప్రదానోత్సవం ఉంటుందన్నారు. ఇందులో సేవాసమితి కోఆర్డినేటింగ్ అధికారి డివైపీఎం ఎండీ ఆసిఫ్, మహిళా ఉద్యోగులు, స్థానిక మహిళలు, సేవా సభ్యులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో ఆలయాల్లో చోరీ

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంతో పాటు పక్కనే నూతనంగా నిర్మించిన సత్యనారాయణ స్వామి, శివాలయాల్లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. స్థానికులు, ఎస్సై రాజవర్ధన్ వివరాల ప్రకారం మూడు ఆలయాల్లోని హుండీలను పగలగొట్టి అందులోని నగదును దుండగులు చోరీ చేశారు. రూ.15వేలు నుంచి రూ.20వేల వరకు నగదు చోరీ అయినట్లు పేర్కొన్నారు. మంగళవారం ఆలయాలను పరిశీలించి, ఆలయ కమిటీ సభ్యులు కమల భూమయ్య చిందం శ్రీనివాస్, ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-నస్పూర్

అజాగ్రత్త, అతివేగంతో కారు నడిపి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొని వ్యక్తి మతి చెందిన సంఘటన సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై సుగుణాకర్ వివరాల ప్రకారం రామగుండంలోని ఎన్టీపీసీలో మేనేజర్‌గా పని చేస్తున్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన భూపేంద్ర సింగ్ (41) రామగుండం నుండి బెల్లంపల్లికి జాతీయ రహదారి 363లో అతివేగంతో వెళ్తుండగా డివైడర్‌ను ఢీ కొట్టి ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొనడంతో కారు క్యాబిన్‌లో వ్యక్తి ఇరుక్కున్నాడు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని కారులో నుండి వ్యక్తిని బయటికి తీయగా ఆయన అప్పటికే మృతిచెంది ఉన్నాడు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



నవతెలంగాణ-తాండూరు

అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు మంచిర్యాల మైనింగ్ శాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి తెలిపారు. టేకులపల్లి నుంచి అచ్చులాపూర్ అక్రమంగా ఇసుకను తీసుకోవస్తుండగా మార్గమధ్యలో పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్ ను విచారణ నిమిత్తం రెవెన్యూ శాఖ వారికి అప్పగించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే సమాచారం అందించాలని శాఖపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు

నవతెలంగాణ-జన్నారం

టీచర్ ఎమ్మెల్సీగా బీజేపీ బలపరిచిన అభ్యర్థి మల్కా కొమురయ్య విజయం సాధించడంపై మండల నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో టపాసులు కాలుస్తూ స్వీట్లు పంచుకున్నారు. ఇందులో మండల అధ్యక్షుడు మధుసూదన్ రావు, నాయకులు, కొంతం శంకరయ్య గోలి చందు, రాగుల సూర్య, బీజేవైఎం మండల అధ్యక్షుడు మడుగు, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆటపాటల్లో రాణించాలి

- జైపూర్ ఎస్సై శ్రీధర్



నవతెలంగాణ-జైపూర్

విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో రాణించాలని స్థానిక ఎస్సై శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ సాంఘీక బాలుర వసతి గృహం విద్యార్థులకు మంగళవారం వాలీబాల్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమ శిక్షణతో చదువుకోవడం ద్వార విద్యార్థి మేదస్సు పెరుగుతుందని, క్రీడలతో శరీర ధారడ్యంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. భవిష్యత్ లక్ష్యంతో విద్యాభ్యాసం కొనసాగించాలని తెలిపారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు. ప్రణాళికతో చదువుకుని వార్షిక పరిక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని లోడ్పల్లి గ్రామంలో మంగళవారం అనుమానాస్పద స్థితిలో మతి చెందిన గుర్లే లలిత హత్య కేసు మిస్టరీ వీడింది. మతురాలి తల్లి తానక్కా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాసరావు, పెంచికలపేట్ ఎస్సై కొమురయ్య విచారణ చేపట్టి నిందితుడిని పట్టుకున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. దర్యాప్తులో భాగంగా పరారీలో ఉన్న మతురాలి భర్త గుర్లె గణేష్‌ను ఎల్కపల్లి బస్టాండ్‌లో అరెస్ట్ చేసి విచారించగా నేరం అంగీకరించినట్లు తెలిపారు. అనుమానంతో భార్యను చంపాలని నిర్ణయించుకుని ఆమెతో గొడవపడినట్లు, ఎవ్వరికి కనపడకుండా చేనుల్లో నుంచి ఇంటికి వెళ్దామని చెప్పి మామిడితోటల గుండా తీసుకెళ్లి ఒక్కసారిగా లలిత చాతిపై గట్టిగా కొట్టగా ఆమె క్రిందపడగానే ముక్కు, నోరును గట్టిగా అదిమి ఊపిరాడకుండా చేసి చంపినట్లు ఒప్పుకున్నాడు. ఈ మేరకు గణేష్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

లైన్‌మెన్స్ డే సందర్భంగా సత్కారం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

జూనియర్ లైనుమెను, లైన్మెన్లు, సిబ్బంది వల్లే టీజీఎన్పీడీసీఎల్ పరిధిలో లక్షలాది మంది విద్యుత్ వినియోగదారులకు, పరిశ్రమలకు, వ్యవసాయదారులకు నిత్యం నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అవుతుందనని ఏడీ ప్రభాకర్, ఏఈ గణేష్ అన్నారు. మంగళవారం జాతీయ లైన్‌మెన్స్ డేను పురస్కరించుకుని అంకిత భావంతో పనిచేస్తున్న జూనియర్ లైనుమెను, లైన్మెన్లు, సిబ్బందికి శాలువాతో సన్మానించి చిరు సత్కారం చేసినట్లు తెలిపారు.

కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర బడ్జెట్

నవతెలంగాణ-మంచిర్యాల



సెమినార్‌లో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ప్రసాద్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను సవరించి కార్మికులు, పేద ప్రజల జీవన ప్రమాణాలు పెంచే విధంగా బడ్జెట్ ఏర్పాటు చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఎస్ఎస్ఆర్‌పి ప్రసాద్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అధ్యక్షతన మంగళవారం జిల్లా కేంద్రంలోని చార్వక హాల్‌లో సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంతో బీజేపీ కార్మిక వ్యతిరేక వైఖరి మరోసారి స్పష్టం అయిందన్నారు. సామాన్య ప్రజలు, కార్మిక వర్గంపై అనేక భారాలు మోపుతూ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసేలా బడ్జెట్ ఉందన్నారు. రూ.50.66 లక్షల కోట్లతో కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టారని, బడ్జెట్ లోటును పూడ్చుకునేందుకు ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాలను అమ్మేయాలని చూస్తోందన్నారు. బీమా రంగంలో 74 శాతం నుండి 100శాతం (ఎఫ్‌డీఐ) విదేశీ పెట్టుబడిదారులకు అనుమతిస్తూ దేశీయ బీమా రంగాన్ని ప్రమాదంలో పడేస్తోందని, విద్యుత్తు, మైనింగ్ రంగాలను పూర్తిగా ప్రైవేటీకరించడానికి బడ్జెట్లోనే ప్రతిపాదించడం అత్యంత ప్రమాదకరమన్నారు. మరోవైపు మౌలిక వసతులు కల్పన మెడికల్, టూరిజం, సోలార్ విద్యుత్ వాహనాలు, షిప్పుల తయారీ రంగాలలో పీపీపీ పద్ధతులు ప్రవేశపెట్టి పారిశ్రామికరంగాలకు అనుకూలంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్రాములు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వము కార్పొరేటు శక్తులకు సంపన్నులకు మరిన్ని రాయితీలు ఇచ్చి ప్రోత్సహించడం దుర్మార్గం అన్నారు. వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యత అంటూనే రైతు రుణమాఫీ పథకం కింద ధరల స్థిరీకరణ చట్టాన్నికి ప్రాధాన్యత ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకానికి నిధుల కోత పెట్టి ఉద్యోగాల భర్తీ ప్రణాళికలు లేవని, ఆర్థిక సంస్కరణలు అమలు చేస్తూనే తెలంగాణ రాష్ట్రానికి మొండిచేయి చూపిందన్నారు. మోడీ సర్కార్ కార్మిక, కర్షక, రైతు ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు సారంగపాణి, వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యురాలు శారద, రైతు సంగం అధ్యక్షుడు సంకె రవి, జిల్లా కార్యదర్శి కనికారపు అశోక్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండగర్ల లింగన్న, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి ప్రకాష్, దూలం శ్రీనివాస్, భానుమతి, జిల్లా సహాయ కార్యదర్శులు, అశోక్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దేవదాస్ లక్ష్మణ్, రాజన్న పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యగం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలి

- కోటపల్లి మండలంలో పర్యటించిన కలెక్టర్ కుమార్ దీపక్



సంబంధిత అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-జైపూర్

విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కోటపల్లి మండలం పంగడిసోమారం గ్రామ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాల పరిసరాలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అంగన్‌వాడి కేంద్రాన్ని, నర్సరీని పరిశీలించారు. వేసవి ఎండలు దృష్టితో మొక్కలకు క్రమం తప్పకుండా నీరందించాలని సూచించారు. గ్రామ పంచాయతీ పరిధిలో తాగు నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. షెట్‌పల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనలో నాణ్యతాప్రమాణాలు పరిశీలించారు. మోనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలన్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో మురుగు కాలువల వ్యవస్థను పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు.

సంస్థ అభివృద్ధిలో కార్మికులది కీలక పాత్ర

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ ఉపరితల గనిని సందర్శించి కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న జీఎం

సింగరేణి సంస్థ అభివృద్ధిలో కార్మికులు కీలకమని శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం జీఎంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శ్రీరాంపూర్ ఉపరితల గనిని గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రెటరీ ఎస్‌కే బాజీసైదాతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఉత్పత్తి, ఉత్పాదకత, కంపెనీ భవిష్యత్తు, కార్మికుల సంక్షేమంపై కీలక విషయాలను ఇరువురు ప్రస్తావించారు. కార్మికులకు అల్పాహారం అందజేస్తున్న క్యాంటీన్‌ని సందర్శించి అందిస్తున్న తీరును పరిశీలించారు. ఇందులో శ్రీరాంపూర్ ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాస్, ప్రాజెక్ట్ మేనేజర్ బ్రహ్మాజీ, ప్రాజెక్ట్ ఇంజనీర్ నాగరాజు, రక్షణాధికారి, వెల్ఫేర్ ఆఫీసర్, అధికారుల సంఘం ప్రతినిధి, గుర్తింపు సంఘం జాయింట్ సెక్రెటరీ చంద్రమోహన్, జీఎం చర్చల ప్రతినిధి బద్రి బుచ్చయ్య, ట్రేడ్స్‌మెన్ ఉపాధ్యక్షుడు నాగభూషణం, ఫిట్ సెక్రటరీ మోతే లచ్చన్న, గండి సతీష్, కొత్తపల్లి శ్రీనివాస్, రాజేందర్, పిట్ కమిటీ, మైన్ కమిటీ, సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యే భవిష్యత్తుకు పునాది



- విద్యాశాఖ అధికారి ఎస్ యాదయ్య

నవతెలంగాణ-మంచిర్యాల

ప్రాథమిక విద్య అనేది ప్రతి ఒక్కరి జీవితంలో అత్యంత ముఖ్యమైనదని, భవిష్యత్తుకు పునాది లాంటిదని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య అన్నారు. 2024 డీఎస్సీ ద్వారా ఎంపికైన సెకండరి గ్రేడ్ ఉపాధ్యాయులకు మంగళవారం జిల్లా సైన్స్ కేంద్రంలో నిర్వహించిన రెండవ విడత శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులను తమ సొంత బిడ్డల్లా చూసుకోవాలని, సంపూర్ణ మూర్తిమత్వం సాధించేలాగా కషి చేయాలన్నారు. సమయపాలన, నిబద్ధతతో కూడిన పని విధానం, విద్యార్థుల పట్ల నడుచుకునే విధానం తదిరాలపై విషయాలు శిక్షణలో వివరించడం జరుగుతుందన్నారు. శిక్షణ మూడు రోజుల పాటు కొనసాగుతుందన్నారు. ఇందులో కోఆర్డినేటర్లు చౌదరి సత్యనారాయణ మూర్తి, డీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పశువుల కొట్టు దగ్ధం

- రూ. 2 లక్షల ఆస్తి నష్టం

నవతెలంగాణ-దహెగాం



మండలంలోని బోర్లకుంట గ్రామంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని సొనులె పోశన్న పశువుల కొట్టం పూర్తిగా దగ్ధమైంది. ఇందులో ఉన్న వ్యవసాయ పనిముట్లు, బోర్ పైపులు కాలి బూడిదయ్యాయి. సంఘటన స్థలాన్ని ఆర్ఐ శృతి పరిశీలించి వివరాలు సేకరించారు. ఆర్థికంగా నష్టపోయిన తనను ఆదుకోవాలని బాధితుడు ప్రభుత్వం కోరుతున్నాడు. సుమారు రూ.2 లక్షల విలువ చేసే వస్తువులు దగ్ధం అయినట్టు బాదితుడు పేర్కొంటున్నాడు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



నవతెలంగాణ-తాండూర్

టాస్క్ ఫోర్సు సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ ఎస్సై లచ్చన్న సిబ్బంది కలిసి మంగళవారం బోయపల్లి శివారులో 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. బెల్లంపల్లి నుండి నుండి తాండూరు వైపుగా ఆటోలో అక్రమంగా తరలిసుండగా పట్టుకున్నట్లు వివరించారు. ఆటో, బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు బియ్యం తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులు దుర్గం శ్రీకాంత్, బి.చందు, కనుగుల తిరుపతిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. మరో వ్యక్తి గోవిందుల శ్రీనివాస్ పరారీలో ఉన్నాడని, విచారణ నిమిత్తం ఎస్ఐ కిరణ్ కుమార్‌కు ఆటో, బియ్యం, ముగ్గురిని అప్పగించినట్లు తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



నవతెలంగాణ-జైపూర్

మద్యం సేవించి వాహనాలు నడపరాద భీమారం ఎస్సై శ్వేత అన్నారు భీమారం మండల కేంద్రంలో మంగళవారం ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల పట్ల అవగాహన కల్పించారు. ఆరేపల్లి-మద్దికల్ మధ్య ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం జరిగిన తీరును ఉదాహరించారు. మద్యం తాగి ఆటో నడపడం ద్వారా జరిగిన ప్రమాదంలో ఒకరు మతి చెందగా పలువురు గాయపడ్డారన్నారు. వాహన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపకూడదని సూచించారు.

సెయింట్ థెరిస్సా హైస్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్

నవతెలంగా-తాండూర్

మండలంలోని రేపల్లెవాడ సెయింట్ థెరీస్సా హైస్కూల్లో మంగళవారం జాతీయ సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు సజనాత్మక ప్రయోగాలు, ప్రాజెక్టులు ప్రజెంటేషన్ చేశారు. ఈ ఎగ్జిబిషన్‌కి ముఖ్య అతిథితులుగా కాగజ్‌నగర్ ఫాతిమా కాన్వెంట్ హైస్కూల్ ప్రిన్సిపల్ సిస్టర్ సాఫల్య, వైస్ ప్రిన్సిపాల్ ప్లవారి హాజరై మాట్లాడారు. విద్యార్థులు చిన్ననాటి నుండి సైన్సు మీద పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సైన్స్‌లో రాణిస్తే ఉన్నత విద్య ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆంటోనీ, వైస్ ప్రిన్సిపాల్ జోష్, స్టాఫ్ సెక్రటరీ సిస్టర్ సారా, కేజీ ఇంచార్జి సిస్టర్ రేన్సీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. వసతి, సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు మోడల్ కళాశాల ఇంటర్ విద్యార్థులు ఇక్కడి పరీక్షా కేంద్రంలో పరీక్షలు రాయనున్నారు. జనరల్ విద్యార్థులు 193, ఒకేషనల్ విద్యార్థులు 37 మంది మొత్తం 230 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌గా సీహెచ్ రాజేశ్వరి, డిపార్ట్మెంట్ ఆఫీసర్‌గా శ్రీనివాస్ విధులు నిర్వహిస్తున్నారు.

అంగన్వాడీ ఉద్యోగుల అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం

నవతెలంగాణ-మంచిర్యాల



అర్ధరాత్రి అంగన్‌వాడీల అక్రమ అరెస్టలను పాల్పడటాన్ని ఖండిస్తున్నట్లు అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భానుమతి అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని చార్వక హాల్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యేలకు, మంత్రులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు సీఐటీయూ రాష్ట్ర కమిటీ చలో ప్రజాభవన్‌కు పిలుపునివ్వగా పోలీసులు అర్ధరాత్రి నుంచి అక్రమంగా అరెస్టులు చేయడం సిగ్గుచేటన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు కాలయాపన చేయకుండా వెంటనే అమలు చేయాలన్నారు. ఇందులో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి మహేశ్వరి, జిల్లా నాయకులు పద్మ సరిత అనురాధ సబిత పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆటపాటల్లో రాణించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

చదువుతో పాటు ఆటపాటల్లో రాణించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్ సింగ్‌అన్నారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యకమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులుచే విద్యను బోధించడం జరుగుతుందని, విద్యతో పాటు ఆటపాటల్లో రాణించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాలు విడుదల కాగానే డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభమవుతాయన్నారు. కళాశాలలో అడ్మిషన్ తీసుకోవాలని కోరారు.

పదో తరగతి పరీక్షలపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-బోథ్

సొనాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని మంగళవారం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అసిస్టెంట్ ప్రొఫెసర్ అవగాహన కల్పించారు. వ్యక్తిత్వ వికాసం, స్వీయ అధ్యయనం, సమాజంతో నడుచుకునే విధానం పంచ సూత్రాలు వివరించారు. అనంతరం పాఠశాలకు ఎలక్ట్రిసిటీ బెల్, గ్రంథాలయ పుస్తకాలను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది మర్యాదపూర్వకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు నర్సయ్య, ఉపాధ్యాయులు రాడపు మధుసూదన్ పాల్గొన్నారు.

7న మంద కృష్ణ మాదిగ రాక

నవతెలంగాణ-ఇచ్చోడ

ఈనెల 7న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ ఇచ్చోడ వస్తున్నారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అరెల్లి మల్లేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు కూడాల స్వామి మాట్లాడారు. ఈనెల 7న మండల కేంద్రానికి ఎమ్మార్పీఎస్ జిల్లా డప్పుల ప్రదర్శన సదస్సుకు ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ స్థానిక షార్ప్ గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు హాజరవుతున్నారని అన్నారు. ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం ఎస్సీ వర్గీకరణపై షమీమ్ అక్తర్ కమిషన్ ఇచ్చిన నివేదికలో లోపాలను సవరించాలని, రాష్ట్ర జనాభాలో మెజార్టీ మాదిగలకు, మంత్రివర్గంలో రెండు మంత్రి పదవులో చోటు కల్పించాలని అన్నారు. ఎస్సీ వర్గీకరణలో ఏబీసీ తీసుకొచ్చిన విధానంలో శాస్త్రీయ భద్రత లేనందున ఏబీసీడీ నాలుగు గ్రూపుల విభజించాలని కోరుతూ జిల్లాలో డప్పుల ప్రదర్శన సదస్సుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న మాదిగ ఉపకులాలు, వర్గీకరణను బలపరుస్తున్న ప్రజాస్వామికవాదులు మేధావులు అన్ని వర్గాల ప్రజలు వేలాది సంఖ్యలో తరలి వచ్చి సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు కంబ్లె బాలాజీ, దుబ్బాక సుభాష్, సిరిసిల్ల భూమయ్య, బేడ బుడగ జంగం జిల్లా ప్రధాన కార్యదర్శి పేర్ల గంగన్న, టేకుల రాజు, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షులు చిట్టి రవి, మధుకర్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పసుల శ్రీకాంత్, మచ్చ గంగయ్య పాల్గొన్నారు.

ఎస్బీఐ ఆధ్వర్యంలో మహిళలకు రుణ వితరణ

నవతెలంగాణ-నిర్మల్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నిర్మల్ మండలం చిట్యాల శాఖ ఆధ్వర్యంలో నాలుగు స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.60 లక్షల రుణాలను మంజూరు చేసినట్లు లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్ తెలిపారు. మంగళవారం బ్యాంకు ఆవరణలో లబ్ధిదారులకు రుణ మంజూరు పత్రాలను బ్యాంకు అధికారులతో కలిసి అందజేశారు. మంజూరైన రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకొని, చిన్న చిన్న వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ పాండు, సిబ్బంది రామకృష్ణ, సంతోష్ మహిళలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మానవ హక్కుల సమైక్య జిల్లా అధ్యక్షుడిగా వెంకటస్వామి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

అంతర్జాతీయ మానవ హక్కుల సమైక్య జిల్లా అధ్యక్షులుగా నిర్మల్‌కు చెందిన కుంటోల్ల వెంకటస్వామిని నియమించారు. మంగళవారం నిర్మల్ పట్టణంలోని కేంద్ర భవనంలో అంతర్జాతీయ మానవ హక్కుల సమైక్య జిల్లా సమావేశం నిర్వహించారు. జాతీయ అధ్యక్షులు ప్రొ. డా. వీఎల్ రాజును జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. సంఘ బలోపేతం కోసం కృషి చేస్తానని వెంకటస్వామి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు సన్మానించారు.

బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు ఆందోళన



నవతెలంగాణ-ముధోల్

మండలంలోని బోరేగాం, కారేగాం గ్రామాల మధ్యలో రోడ్డుపై ఉన్న లోలెవల్ వంతెనను తొలగించి, బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు మంగళవారం ఆందోళనకు దిగారు. ముధోల్ నుంచి వట్టోలి వరకు కేంద్ర ప్రభుత్వ నిధులతో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు కొన సాగుతున్నాయి. అయితే లోలెవెల్ వంతెనపై సీసీ రోడ్ వేయటానికి కాంట్రాక్టర్ సన్నాహాలు చేయడంతో విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి వెళ్లి తమ నిరసన వ్యక్తం చేశారు. పాత లోలెవెల్ వంతెనకు పూతలు వేయటం సరికాదని గ్రామస్తులు మండిపడ్డారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో భారీ వర్షాలు పడినప్పుడు లోలేవల్ వంతెనపై నుంచి భారీ స్థాయిలో వర్షపు నీరు ప్రవహించడంతో తమ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయన్నారు. బ్రిడ్జి నిర్మించి శాశ్వత పరిష్కారాన్ని చూపాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న రోడ్డు భవనాల శాఖ డీఈఈ సునీల్ గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. దీంతో గ్రామస్తులు శాంతించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్రం అమృత మురళి, నాయకులు పండరి, భోజన్న, రామ్ సేనా, కిషన్, భగత్ యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ



నవతెలంగాణ-ఖానాపూర్

అనారోగ్యంతో ఐసీయూలో ఉన్న పంచాయతీ కార్యదర్శి కుటుంబ సభ్యులను మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ పరామర్శించారు. మండలంలోని రాజుర గ్రామపంచాయతీ పరిధిలో గల దాసు నాయక్ తండాలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న రాజు గత నెల 27న కాలు ఇన్‌ఫెక్షన్‌తో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో వైద్య చికిత్సల కోసం చేరాడు. కాగా పరిస్థితి విషమించి కోమాలోకి వెళ్లిపోయాడు. దీంతో బాధితుడికి ప్రతిరోజు అక్కడ రూ. ఒక లక్ష డబ్బులు చికిత్స నిమిత్తం ఖర్చులు అయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు ఒక్కసారిగా కంగు తిన్నారు. అంత పెద్ద మొత్తంలో డబ్బులు లేవని, చికిత్స చేయించుకోలేని పరిస్థితి ఏర్పడింది. అక్కడి నుంచి మంగళవారం నిర్మల్ ఏరియా ఆస్పత్రికి బాధితున్ని తీసుకువచ్చి ఐసీఈలో అడ్మిట్ చేశారు. కాగా విషయం తెలుసుకున్న తోటి ఉద్యోగస్తులు రాజు కుటుంబానికి అండగా నిలబడి పెంబి పంచాయతీ కార్యదర్శులు రూ.50వేలు, ఖానాపూర్ మండల పంచాయతీ కార్యదర్శులు రూ.50వేలు ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. అంతేకాకుండా జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రూ.5వేలు, ఖానాపూర్ ఎంపీడీఓ సునీత రూ.3వేలు, ఖానాపూర్ ఎంపీఓ రత్నాకర్‌రావు రూ.3వేలు ఆర్థిక సాయాన్ని అందజేసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ విషయమై డీఎంహెచ్ఓకు ఫోన్‌లో మాట్లాడి పంచాయతీ కార్యదర్శి రాజు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఫొటోగ్రాఫర్లకు ఐడీ కార్డు తప్పనిసరి



నవతెలంగాణ-ఉట్నూర్

ఫోటోగ్రాఫర్‌కు ఐడీ కార్డు తప్పనిసరి అని ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధక్షుడు మరికంటి మహేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని శిశు మందిర్‌లో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అసోసియేషన్‌లో సభ్యత్వం పొందని వారు ఫోటో గ్రాఫర్ ఫోటో గ్రాఫీ చేసే హక్కు లేదని, ఐడీ కార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలని అన్నారు. ఫోటోగ్రాఫీ విలువలు తెలుసుకొని, కనీసం 3 సంవత్సరాల అనుభవం లేని వారు తక్కువ రేటుతో పెండ్లిలు అర్డర్‌లు చేసి అప్పటికి డబ్బులు తీసుకొని కస్టమర్‌కు అల్బమ్, వీడియో ఇవ్వడం లేదని అన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ మండల ఫోటో, వీడియో గ్రాఫర్ అధ్యక్షులు సేవాదాస్, ప్రధాన కార్యదర్శి రూబెన్, కోశాధికారి విశాల్, మహేందర్, సంజయ్ సింగ్, సాయి, రాజ్ కేంద్రే, సునీల్, కరణ్, రాహుల్ పాల్గొన్నారు.

పాఠశాలలకు ల్యాప్‌ట్యాప్‌ల పంపిణీ



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

అటల్ టింకరింగ్ ల్యాబ్ ద్వారా మంజూరైన ల్యాప్‌ట్యాప్‌లను 17 పీఎంశ్రీ పాఠశాలలకు మంగళవారం డీఈఓ రామారావు అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ జిల్లాలో పీఎంశ్రీ ద్వారా ఎంపికైన 20 విద్యాలయాల్లో 17 పాఠశాలలకు ల్యాప్‌ట్యాప్‌లు, 65 ఇంచుల ఐఎఫ్‌పీ, ట్యాబ్‌లు అందజేశారు. మంజూరైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వాటిని సద్వినియోగం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కొరటికల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మామడ ఎంఈఓ, ఫైనాన్స్ అకౌంట్ అధికారి వైవి రమణారెడ్డి, సూపరింటెండెంట్ వెంకటరమణ, శ్రావణిలు, జిల్లా విద్యాశాఖ సమన్వయకర్తలు ప్రవీణ్ కుమార్, నర్సయ్య, జిల్లా సైన్స్ అధికారి వినోద్ కుమార్, జిల్లా ఉమ్మడి పరీక్షల సహాయ కార్యదర్శి భానుమూర్తి, కేజీబీవీ కుభీర్, దస్తురాబాద్ ప్రత్యేకాధికారులు, బాసర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వెంకటేశ్వర స్వామి జాతర



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని బరంపూర్ కొండపై వెలిసిన పురాతన దేవాలయం వెంకటేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు కావడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చారు. యజ్ఞయాగాదులు, ప్రత్యేక పూజలు చేశారు. ఈ జాతర చివరి రోజు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే శ్రీ వెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవాన్ని వేలాది మంది భక్తుల మద్య జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం లడ్డు వేలం వేయగా గత సంవత్సరం వేలం పాటలో రూ.లక్షా 7వేలకు దక్కించుకున్న పాముల స్వప్న శ్రీనివాస్ ఈ సంవత్సరం రూ.లక్ష 47వేలకు దక్కించుకున్నారు. ఈ జాతర వేడుకల్లో కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, కాంగ్రెస్ మండల కన్వీనర్ కళ్యాణం రాజేశ్వర్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ తోట వెంకటేష్, నాయకులు కేదారేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బరంపూర్ గ్రామస్తులు ప్రభాకర్ రెడ్డి, మల్లేష్, నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.